# మధ్యప్రదేశ్ జానపద కథలు

రచన:

**సౌభాగ్య**

ప్రచురణ :

సరోజారాయ్ కమ్యూనికేషన్స్

నిశ్చింత్ టవర్స్, ఫ్లాట్ నెం. 306, అశోక్‌నగర్, హైదరబాద్-500 020. ఫోన్స్: 040-27623320

# MADHYA PRADESH JANAPADA KATHALU

Written by :
**SOWBAGHYA**
Address :

First Edition : 2015

Rs. 80/-

Composed, Designed & Printed at :
**SAROJA ROY DTP & Graphics**,
HYDERABAD.

Printed at:
**AKRUTHI OFFSET PRINTERS**
1-1-191/A, Chikkadapally, Hyderabad - 500 020
Ph: 27664525, 66626475.

© Publisher

***Published by:***

**SAROJA ROY Communications**
**Nischit Towers, Flat No. 306, Ashok nagar,**
**Hyderabad - 500 020. Ph: 040-27623320.**

# రచయిత గురించి



సౌభాగ్య అసలు పేరు విజయకుమార్. సౌభాగ్య అన్నది అతని కలం పేరు. తెలుగు ఎం.ఎ. చేశారు. ఆబిడ్స్‌లోని గ్రామర్ స్కూల్లో టీచర్‌గా పనిచేసి ఇటీవలె రిటైరయ్యారు. గత నాలుగు దశాబ్దాలుగా సౌభాగ్య తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేష కృషి చేశారు.

సౌభాగ్య కవి, రచయిత, విమర్శకుడు, అనువాదకుడు. సంధ్యా బీభత్సం, కృత్యాద్యవస్థ, సింహావలోకనం, పునరుత్థానం, ప్రేమ కవితలు, యాభై దాటిన యవ్వనం సౌభాగ్య కవితా సంపుటాలు. సాహిత్య వ్యాసాలు, సమీక్షలు, వ్యాసాలు ద్వేషాలు సౌభాగ్య విమర్శ గ్రంథాలు.

ప్రసిద్ధ ఉర్దూ కవులు, ప్రాపర్టియస్ కవిత, ఆధునిక ప్రపంచకవులు, రెండు వందల ఏళ్ళ జాన్‌కీట్స్, ఇరవయ్యో శతాబ్దం ఇంగ్లీషు కవులు, ఈ కాలం కవులు, వజ్ర శకలాలు, మొదలయినవి ప్రపంచ సాహిత్య పరిచయ గ్రంథాలు. శిఖామణి, యాకూబ్, ఆశారాజు, కందుకూరి శ్రీరాములు, కె.ఎస్. రమణ తదితర కవులపై కవిత్వ పరామర్శ గ్రంథాలు రాశారు. ఆస్కార వైల్డ్ ఆలోచనలు, నిత్య జీవితంలో ధ్యానం, అద్భుతమైన కథలు, పాశ్చాత్య సంగీత కారుల జీవితాలు, తావో తరంగాలు వంటి వైవిధ్య తాత్విక రచనలు చేశారు. అక్బర్ బీర్బల్ కథలు, గ్రీకు రోమన్ కథలు, ఈసఫ్ కథలు, మంచి మంచి కథలు వంటి ఎన్నో పిల్లల కోసం కథా సంపుటాలు తెచ్చారు.

ప్రపంచ ప్రసిద్ధమయిన జోక్స్ రెండు సంపుటాలు తెచ్చారు.

సుప్రసిద్ధ మార్మికుడు ఓషో రచనల్ని తెలుగువాళ్ళకు పరిచయం చేసే పనిలో వున్నారు.

**- పబ్లిషర్**

# విషయ సూచిక

1. సోనా – రూపా

2. బిరాన్ బాయి

3. కేసర్ – కచ్‌నార్

4. తెలివైన కోడలు

5. వజ్రపు దొంగ

6. వివేకవంతుడయిన న్యాయనిర్ణేత

7. కుండ కొడుకు

8. అక్క తెలివి

9. ధన్వర్ – కాకి

10. మేఘీ రాణా

11. జల ప్రళయం

12. రాజల్

13. రాణి శపథం

14. డబ్బిచ్చి కొన్న పాట

15. విశ్వాసం

16. బద్ధకస్తురాలు – నాలుగు కీలుబొమ్మలు

17. హరి – గిరి

# 1 సోనా - రూపా

ఒక రాజకుమారుడికి వేట అంటే ఎంతో యిష్టం. ఉదయాన్నే సూర్యోదయంతో బయల్దేరేవాడు. అతని దగ్గర ఒక ఆడగుర్రం తెల్లనిది వుండేది. దాని పైన వెళ్ళేవాడు. ఆ గుర్రం ఏమాత్రం అలసిపోకుండా రాజకుమారుడు ఎక్కడికి తీసుకెళితే అక్కడికి వెళ్ళేది.

ఒకరోజు వేటాడుతూ సాయంత్రం దాకా గడిపాడు, ఒక నది రాజభవనం వేపు సాగుతుంది. ఆ నదీతీరం వెంట బయల్దేరాడు. సాయం సంధ్య కిరణాలు నదిపై పడి మెరుస్తున్నాయి. ప్రకృతిమనోహరంగా వుంది. చల్లని గాలి వీస్తోంది.

అంతలో నది అలలపై వెండి బంగారు రంగులు కలిసిన కొన్ని వెంట్రు కల్ని బట్టి నది పైన ఎవరో అపురూప సౌందర్యవతులు స్నానం చేస్తున్నట్లు వూహించాడు. బంగారు రంగులో వున్న ఆ శిరోజాల్ని చూసి ఆ అందగత్తెల సౌందర్యాన్ని వూహించుకున్నాడు. వెంటనే కష్టం మీద కొన్ని వెంట్రుకల్ని సేకరించి తనతో బాటు అంతఃపురానికి తీసుకెళ్ళాడు.

అది భోజన సమయం రాణిగారు కొడుకు కోసం వెతికింది. పనివాళ్ళను పంపింది. రాజకుమారుడు తనగదిలో వున్నాడని తెలిసి తానే వెళ్ళింది. రాజకుమారుడు ఒక మూల దిగులుగా తలవంచుకుని కూర్చున్నాడు. రాణి ఆందోళనతో ఏమైంది? ఎందుకలా వున్నావు? ఎవరయినా నిన్నేమైనా అన్నారా! వాళ్ళ తల తీయిస్తాను. ఎవరయినా నీకు వ్యతిరేకంగా చేయిఎత్తారా! వాళ్ళ చేయి తీయించేస్తాను చెప్పు అంది.

అటువంటి దేమీ లేదన్నాడు, మరయితే ఎందుకంత దిగులుగా వున్నావంది. తన దగ్గరవున్న బంగారు వెంట్రుకల్ని చూపి, అమ్మా! యిట్లాంటి శిరోజాలు వున్న అమ్మాయినే నేను పెళ్ళి చేసుకుంటాను అన్నాడు.

రాణి ఓస్! యింతేనా? తప్పకుండా యిట్లాంటి శిరోజాలువున్న అమ్మాయిని వెతికి నీకు పెళ్ళి చేస్తాను. సరేనా? రా, భోంచేద్దువుగానీ అని రాజకుమారుణ్ణి బుజ్జగించి భోజనానికి లేపింది.

అన్నదే కానీ అటువంటి శిరోజాలున్న అమ్మాయిని కనిపెట్టడం అసంభవం అని మనసులో సందేహపడింది.

ఐనా ప్రయత్నించి చూద్దామని దేశంలో నలువైపులా అట్లాంటి వెంట్రుకలున్న

అమ్మాయిని అన్వేషించమని మానుషుల్ని పంపింది.

రాణి ఆరోజు నించే ప్రయత్నం ప్రారంభించింది. నగరంలోని అమ్మాయి లందర్నీ అంతఃపురానికి పిలిపించి అట్లాంటి వెంట్రుకలున్న అమ్మాయి వుందేమో అని పరిశీలించింది. ఎవరూ కనిపించలేదు.

అందరూ వెళ్ళిపోతూ వుంటే హఠాత్తుగా వాళ్ళలో యిద్దరు అమ్మాయిల శిరోజాలు వెండి, బంగారం రంగుల్లో మెరిసిపోతూ వుండడం రాజకుమారుడు చూశాడు. అమ్మా! అదిగో! నేను కోరుకున్న అమ్మాయిలు అన్నాడు. రాణి ఆ అమ్మాయిల్ని చూసి, అయ్యో! నాయనా! వాళ్ళు నీ చెల్లెళ్ళు అంది.

రాజకుమారుడు చిరునవ్వు నవ్వాడు. అయినా మొండిపట్టుదల వదల్లేదు నేను వెండి, బంగారం శిరోజాలు వున్న అమ్మాయిల్ని పెళ్ళాడాలని మనసులో సంకల్పించాను. వాళ్ళు ఎవరన్నది నాకు అనవసరం. వాళ్ళు నాకు కావాలి. అంతే! అని భీష్మించుకు కూచున్నాడు.

రాజు రాణి ఎంతో చెప్పిచూశారు. వినలేదు. చెల్లెళ్ళకు ఆ సంగతి తెలిసి కుమిలి పోయారు. ఆ రాజకుమార్తెలు ప్రతిరోజు నదిపై భాగంలో స్నానం చేసేవాళ్ళు. అక్కడ ఒక గంథపు చెట్టువుండేది. దాని కింద విశ్రాంతి తీసుకునే వాళ్ళు. ఈ విషయం తెలిసి దిగులుగా వాళ్ళిద్దరు గంథం చెట్టు దగ్గరికి వెళ్ళి చెట్టెక్కారు.

తగని పనయినా రాజకుమారుడి మొండితనంతో ముహూర్తం నిశ్చయమైంది. రాజు కూతుళ్ళను వెతుక్కుంటూ వచ్చాడు. వాళ్ళను గంథపు చెట్టుపై చూశాడు.

అమ్మయిలూ! సోనా! రూపా! మూహూర్తం ముంచుకొస్తోంది. దిగిరండి!, అన్నాడు.

వాళ్ళు మా ప్రియమైన తండ్రీ ! యిప్పటిదాకా మిమ్మల్ని నాన్నా! అని పిలిచాం. మిమ్మల్ని మామగారు అని ఎట్లా పిలవగలం! అన్నారు.

కొమ్మల్ని ఎగబాగి పైపైకి వెళ్ళారు. చెట్టుదగ్గరకు అందరూ చేరారు.

రాజకుమారుడు. చెల్లాయిలూ! దిగిరండి! ముహూర్తం సమయం ముంచుకొస్తోంది అన్నాడు.

'యిప్పటిదాకా నిన్ను అన్నా! అన్నాం!

యికపై భర్తా! అని ఎలా పిలవాలి? అన్నారు చెట్టు పై మరింత మరింత ఎగబాకారు.

వున్నట్లుండి మేఘాలు కమ్ముకున్నాయి వురుములు, మెరుపులు వచ్చాయి. గంథంచెట్టు రెండుగాచీలింది. ఆ చీలికలోగుండా సోనా, రూపాసాగి చెట్టుగర్భంలోకి చేరిపోయారు.

# 2 బిరాన్ బాయి

ఒక గ్రామంలో ఏడుగురు అన్నదమ్ములుండేవాళ్ళు. వాళ్ళకు ఒక్కగానొక్క చెల్లెలు. ఆమెపేరు బిరాన్ బాయి. అన్నదమ్ములకు పెళ్ళయింది. ఒక్కగానొక్క చెల్లెల్ని అన్నలందరూ ఎంతో ముద్దుగా చూసుకునేవాళ్ళు. వాళ్ళ తల్లిదండ్రులకు కూడా బిరాన్ బాయి అంటే ప్రాణం.

ఒకసారి వాళ్ళ తల్లిదండ్రులు తీర్థయాత్రకు వెళుతూ కోడళ్ళనందర్నీ పిలిచి మేము వచ్చేదాకా అమ్మాయిని జాగ్రత్తగా చూసుకోండి. ఏ పనీ చెప్పకండి. కష్టపెట్టకండి అన్నారు. కోడళ్ళు, మీరు అంతగా చెప్పాలా! మా మరదలంటే మాకూ ప్రాణం కదా! ఆమెను కాలుకిందపెట్టనీకుండా చూసుకుంటాం. మీరు నిశ్చింతగా వెళ్ళిరాండి అన్నారు.

అలాగే అన్నదమ్ములు ఏడుమందీ వ్యాపారనిమిత్తం పొరుగువూరికి వెళ్ళారు. చెల్లెలు గురించి భార్యల్తో జాగ్రతగా చూసుకోమని చెప్పారు.

రెండ్రోజులు గడిచాకా కోడళ్ళు వూరికి దూరంగా కొన్ని మైళ్ళదూరంలో వున్న సున్నపుగనుల దగ్గరకు వెళ్ళి సున్నపురాళ్ళను తీసుకురావడానికి బయల్దేరారు. బిరాన్ బాయిని కూడా వెంట తీసుకెళ్ళారు. బుట్టలలో సున్నపు రాళ్ళను తీసుకుని బయల్దేరారు. తన బుట్ట బరువుగా వుందని, తలపై పెట్టమని మరదలు అడిగింది. కోడళ్ళు వద్దు,వద్దు, నువ్వు బరువుమోయలేవు. నీ నెత్తిన బుట్ట పెడితే మీ అన్నలు మమ్మల్ని చంపుతారు. నువ్వు యక్కడే వుండు. మేము గంటలో వచ్చేస్తాము అని వెళ్ళారు.

అమాయకురాలయిన బిరాన్ బాయి ఎంత సేపు ఎదురు చూసినా వదినలు తిరిగిరాలేదు. చీకటి పడుతోంది. భయపడింది. మరదల్ని దిక్కులేనిదాన్ని చెయ్యాలన్నదే వదినల కుట్ర. అందుకనే వంటరిగా వదిలేశారు. బిరాన్ బాయికి దారి తెలీదు. కన్నీళ్ళువచ్చాయి.

అంతలో పాటలు పాడుతూ బిచ్చమెత్తుకునే ఒక దాసరి అటు వేపు వచ్చాడు. ఏడుస్తున్న బిరాన్ బాయిని చూశాడు. ఎందుకు ఏడుస్తున్నావన్నాడు. ఆమె విషయం వివరించింది.

ఆమె వదినలు ఆమెను వదిలించుకోవాలని కుట్రపన్నిన సంగతి దాసరి గ్రహించాడు. ఆమెను ఒంటరిగా వాళ్ళ యింట్లో వదిలితే ప్రాణాలకే హాని అని భావించి తనతో బాటు తీసుకెళ్ళాడు. బిరాన్ బాయి గ్రామాల్లో అత్తన్తో బాటు బిచ్చమెత్తేది. అతనికి ఆరోగ్యం బాగా లేకపోతే ఒంటరిగా బిచ్చమెత్తి తీసుకొచ్చేది.

ఆ దాసరి ఏగ్రామంలో బిచ్చమెత్తినా వద్దనే వాడు కాదు. కానీ బిరాన్ బాయి సొంతగ్రామంలో మటుకు బిచ్చమెత్తడానికి ఆమెని వెళ్ళవద్దనేవాడు. ఎందుకంటే ఎవరయినా ఆమెని బంధిస్తారనేవాడు.

దాంతో ఆమె అటువేపుకు వెళ్ళడానికి జంకింది. ఐతే ఒకరోజు ఆ దాసరి అనారోగ్యంగా వున్నప్పుడు బిచ్చమెత్తడానికి బయల్దేరింది. అనుకోకుండా తన గ్రామంవచ్చింది. తన యిల్లు ఎక్కడుందో ఆ వీధికి వెళ్ళింది. తన యింటి ముందు తన వదినల్లో ఒకావిడ నిల్చుంది.

బిరాన్ బాయి పాడడం మొదలు పెట్టింది. ఆ పాటయిలా వుంది. బిరాన్‌బాయికి ఏడుమంది అన్నలు. ఆమె సున్నపు రాళ్ళకోసం వెళ్ళినపుడు దాసరి ఆమెను తీసుకిపోయాడు అమ్మా! ఆమెను రక్షించు.

ఈ మధ్యలో బిరాన్‌బాయి తల్లి వచ్చింది. మాసిన తలతోవున్న కూతుర్ని గుర్తుపట్టక మళ్ళీ ఆ పాటపాడమంది. బిరాన్ బాయి పాడింది. అప్పుడు తల్లి గుర్తు పట్టి కూతుర్ని కౌగిలించుకుని యింట్లోకి తీసుకెళ్ళింది. తన వదినల గురించి బిరాన్‌బాయి ఏమీ చెప్పలేదు. తల్లిదండ్రులు, అన్నలు ఆమె తిరిగి వచ్చినందుకు ఎంతో సంతోషించారు.

కొన్నాళ్ళు గడిచిపోయాయి బిరాన్‌బాయి పెద్దదయింది. ఆమెకు పెళ్ళి నిశ్చయించారు. దాసరి ఆమెను మరచిపోలేదు. ఆమెకు పెళ్ళి నిశ్చమయిందని తెలుసుకుని 'నువ్వు యింకొకరి దానవు కావచ్చు కానీ నా శిష్యురాలివి అన్నాడు. పెళ్ళి జరుగుతున్నపుడు కూడా అక్కడికి కూడా వచ్చి' నువ్వుయింకొకర్ని పెళ్ళి చేసుకోవచ్చు కానీ నా శిష్యురాలివే అన్నాడు.

ఇట్లా వదిలి పెట్టకుండా దాసరి యిబ్బందులు పెడుతూ పెళ్ళయి అత్త వారింటికి వెళుతున్నపుడు కూడా, పెళ్ళయి నువ్వు అత్తగారింటికి వెళ్ళినా అక్కడ కూడా ప్రత్యక్షమై పెళ్ళయి నువ్వు ఎక్కడికి వచ్చినా నువ్వు నా శిష్యురాలివే అన్నాడు.

బిరాన్‌బాయి భర్తతో నన్ను ఏడుగదుల వెనక పెట్టి తాళం వేయండి. ఎందుకంటే దాసరి నన్ను అపహరిస్తాడు అంది.

ఏడుగదులలోపల వున్నప్పుడు అంతా చీకటగా వున్నపుడు బయట ఏదో శబ్దమయింది.

బిరాన్ బాయి మేలుకుని అంది.

ఏడు తాళాలు వేసిన ఏడుగదులున్నాయి.

మొదటి తాళం తీస్తే మా అత్త మేలుకుంటుంది. రెండో తాళం తీస్తే మా మామ మేలుకొంటాడు, మూడో తాళంతీస్తే మా పెద్ద బావమేలుకొంటాడు, నాలుగో తాళం తీస్తే మా పెద్ద వదిన మేలుకొంటుంది, ఐదో తాళం తీస్తే నా భర్త మేలుకొంటాడు, ఆరో తాళం తేస్తే మా చిన్నవదిన మేలు కొంటుంది, ఏడో తాళం తేస్తే నా భర్త మేలుకొంటాడు,

ఈ రకంగా ఆమె యింట్లో అందర్నీ నిద్రలేపింది. ఈ లోపల ఏడో గది తలుపులు బద్దలు కొట్టి దాసరి బిరాన్‌బాయి గదిలోకి వచ్చాడు. అందరూ అతన్ని పట్టుకుని చితకబాదారు. తరువాత ఎప్పుడు అతని ముఖం ఎవరికీ చూపించలేదు.

బిరాన్ బాయి ప్రశాంతంగా చాలా కాలం జీవించింది.

# 3 కేసర్ – కచ్‌నార్

కేసర్,కచ్‌నార్ అక్కాచెల్లెళ్ళు. వాళ్ళకు పెళ్ళయి చాలాకాలమయింది. కేసర్‌కు ఎనిమిదిమంది పిల్లలు. కచ్‌నార్‌కు పిల్లలు లేరు. అందువల్ల ఆమె చాలా బాధపడింది, మెల్లమెల్లగా ఆ బాధ తన అక్క పిల్లల పట్ల అక్కసుగా మారింది. ఎట్లాగయినా అక్క పిల్లల్ని చంపాలని పథకం వేసింది.

లడ్డూలు చేసి వాటిల్లో విషం కలిపి అక్కయింటికి పంపింది. అవి పిల్లల కోసమే అని చెప్పింది. పిల్లలు ఆ లడ్డూలని ఎంతో యిష్టంతో తిన్నారు. కానీ ఆ ప్రభావం అణుమాత్రం వారిమీద పడలేదు.

కచ్‌నార్ అక్క పిల్లల పరిస్థితి ఎలావుందో చూద్దామని అక్కయింటికి వచ్చింది. పిల్లలు అరుపుల్తో, కేరింతల్తో ఎంతో వుల్లాసంగా కనిపించారు. ఆశ్చర్యపోయింది. తనపథకం పారనందుకు యింకా కసిపెంచుకుంది. యింకో ప్లాను వేసింది.

ఈసారి మనుషుల్ని పెట్టి పాముల్ని, తేళ్ళని, జర్రుల్ని పట్టి తెప్పించి వాటిన్నిట్నీ ఒక బుట్టలో పెట్టి భద్రంగా బలంగా మూతపెట్టి అక్కయింటికి పంపింది. అందులో పిల్లలు ఆడుకునే రకరకాల బొమ్మలు వున్నాయని, అవన్నీ పిల్లల కోసం అని చెప్పిపంపింది. కేసర్ ఎంతో సంతోషించి పిల్లల్ని పిలిచి మీ పిన్ని మీకోసం ఆటబొమ్మల్ని పంపింది. తీసుకొండి అంది. పిల్లలు బుట్టవిప్పి చూస్తే అందులో రకరకాల ఆట బొమ్మలు కనిపించాయి. పిల్లలు వాటితో ఎంతో ఉల్లాసంగా ఆడుకున్నారు.

కాచ్‌నార్ ఈ ప్రయత్నం కూడా విఫలమైంది. ఈ ప్రయత్నం కూడా ఎందుకు ఫలించలేదో అర్థం కాలేదు. ఆమెలో ఈర్ష్యరోజు రోజుకూ ఎక్కువయింది. తన ఆలోచనల్ని అక్క పసికట్టిందా? అన్న సందేహంకలిగింది.

యాదృచ్ఛికంగా కచ్‌నార్ గర్భం ధరించి ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆమె రొమ్ము పాలతో నిండింది. చాలా రోజులకు దేవుడు ఆమె మొర ఆలకించాడు, విధిచేసే వింతల గురించి మనం వూహించలేం! అది మంచికో చెడ్డకో మనకు అర్థంకాదు.

అంతలో ఆ బిడ్డ అనారోగ్యంతో చనిపోయింది. నెత్తీనోరూ బాదుకుని కచ్‌నార్

తన అక్కని ఆడిపోసుకుంది.

చనిపోయిన కూతుర్ని తీసుకుని కచ్‌నార్ తన అక్కయింటికి వచ్చింది. పిల్లలు ఆడుకుంటున్నారు. కేసర్‌స్నానం చేస్తోంది. కచ్‌నార్, అక్కా! ఎక్కడున్నావు? అంది. కేసర్ యిక్కడున్నానంది. కచ్‌నార్, అక్కా! నేను పనిమీద వెళ్తున్నా నా బిడ్డ పడుకుంది. కాసేపటికి వస్తా చూస్తూవుండు అని చెప్పి వెళ్ళింది.

కేసర్ స్నానాల గదినించే, నువ్వేమీ ఆందోళనపడకు. నేను నీ బిడ్డను జాగ్రత్తగా చూసుకుంటాలే అంది.కాసేపటికి స్నానం చేసి వచ్చి కేసర్ బిడ్డను చూసింది. బిడ్డ గాఢంగా నిద్రపోతోంది. మధ్యలో కచ్‌నార్ తిరిగివచ్చింది. తనబిడ్డ మరణానికి అక్కే కారణమని గొడవపెట్టుకుని ఆమెను నిందిద్దామని సిద్ధమై వచ్చింది.

ఆశ్చర్యం! ఆమెవచ్చి చూసేసరికి బిడ్డ ఆడుకొంటోంది! కచ్‌నార్ ఆనందంతో, అవమానంతో వుక్కిరిబిక్కిరయింది. అప్పుడు ఆమె నించీ ఈర్ష్యా సూయలు, ద్వేషాలు మాయమయ్యాయి. నీళ్ళు నిండిన కళ్ళతో, అక్కా! నన్ను మన్నించు నా బిడ్డ మరణానికి నిన్ను నిందించాలని చనిపోయిన నా బిడ్డను యిక్కడకు తీసుకొచ్చాను. నువ్వునా బిడ్డకు ప్రాణం పోశావు. నా దుర్మార్గపు ఆలోచనల్తో కుట్రలు పన్నాను. భవిష్యత్తులో ఎప్పుడూ యిలాంటి దురాలోచనలను చెయ్యను అని తన అక్క కాళ్ల మీద పడింది.

అక్క చెల్లెల్ని లేపి కన్నీళ్ళు తుడిచి కౌగిలించుకుంది.

# 4 తెలివైన కోడలు

ఒక గ్రామంలో ఒక వ్యాపారికి తెలివైన కోడలు వుండేది. వూరికి చివరగా ఒక బావి వుండేది. నీళ్ళు తెచ్చుకోవాలంటే అంతదూరం వెళ్ళాలి. ఆమె ఒక రోజు బిందె తీసుకుని వూరి చివరవున్న బావి దగ్గరకు వెళ్ళింది. బిందెలో నీళ్ళు పట్టడానికి బావిలోకి బక్కెటు వదిలింది.

అంతలో దారంటా వెళుతున్న ఒకతను వచ్చి, అమ్మా! తాగడానికి నీళ్ళు కావాలి కొన్ని యిస్తావా! అని అడిగాడు. ఆమె సందేహిస్తూ, ఎవరు నువ్వు అంది. అతను నేను బాటసారిని అన్నాడు.

ఆమె బాటసారుల్లో రెండురకాల వాళ్ళు వున్నారు. నువ్వు ఏ రకానికి చెందిన వాడివి. దీనికి సమాధానమిస్తేనే నీకు నీళ్ళు యిస్తాను అంది. అతను ఏమీ చెప్పలేక వెళ్ళిపోయాడు.

బక్కెటతో నీళ్ళు తోడి బిందెలో పోసింది. రెండో బక్కెట నీళ్లుపోస్తే బిందె నిండుతుంది. మళ్ళీ తోడడానికి బక్కెట బావిలోకి వదిలింది.

అంతలో మరొకతనువచ్చి, అమ్మా! నేను దాహంతో వున్నాను. కొన్ని నీళ్ళు యివ్వు అన్నాడు. ఆమె నువ్వెవరు? అంది. అతను నేను పేదవాణ్ణి, అన్నాడు.

ఆమె పేదవాళ్ళలో రెండురకాలవాళ్ళున్నారు. నువ్వు ఏరకానికి చెందిన వాడివి? అంది. అతను, అయోమయంగా ఏమీ చెప్పలేక వెళ్ళిపోయాడు.

తరువాత అంతలోనే మరొక వ్యక్తి వచ్చాడు. ఆమె అతన్ని తక్కిన యిద్దర్ని ప్రశ్నించినట్టే అడిగింది.

అతను, నేను చదువురాని వాణ్ణి అన్నాడు. ఆమె చదువురానివాళ్ళలో రెండ్రకాలం వాళ్ళు వున్నారు. నువ్వు ఏరకానికి చెందుతావంది. అతనికి ఏం సమాధానం చెప్పాలో తోచక వెళ్ళాడు.

చివరిగా నాలుగో వ్యక్తి వచ్చాడు. అతను తాను తెలివితక్కువాడినని అన్నాడు. ఆమె, తెలివి తక్కువ వాళ్ళలో రెండు రకాలవాళ్ళు ఉన్నారు. నువ్వు ఏరకానికి చెందిన

వాడివని అడిగింది.

అతను ఏమీ చెప్పలేక వెనుదిరిగాడు, ఆ నలుగురు నిజానికి వెళ్ళలేదు. అక్కడక్కడే తచ్చాడుతున్నారు. ఆమె వాళ్ల నలుగుర్నీ చూసి, మీ కందరికీ దాహంగా వుంటే నాతోబాటురండి. మాయింటికి వచ్చారంటే మీకు దాహం తీరుస్తాను, అంది. వాళ్లు అనుసరించి ఆమె యింటికి వచ్చారు. వాళ్ళని వరండాలో వుండమంది. ఆమె యింట్లోకి వెళ్ళి బిందె వంటింట్లో పెట్టి బట్టలు మార్చుకుని చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి అందరికీ యిచ్చి వాళ్ళ దాహం తీర్చింది.

ఇదంతా దూరం నించీ ఆమె మామగారు చూస్తున్నారు. ఆయన తనలో, నా కొడుకు వూళ్ళో లేడు. నా కోడలేమో ముక్కుమొఖం ఎరుగని నలుగురు మొగాళ్లని యింట్లోకి తీసుకొచ్చింది. యిదంత మంచి పనికాదు, నేను మౌనంగా వుంటే ఈ వ్యవహారం ఎంతదాకా సాగుతుందో ఈ వ్యవహరాన్ని మొగ్గలోనే తుంచేయాలి. తరువాత మన చేతిమీది వాపును మనచేత్తో మాన్పుకో లేని పరిస్థితి వస్తుందేమో అనుకున్నాడు.

ఇట్లా ఆలోచించుకుంటూ ఆ వ్యాపారి రాజుగారి దగ్గరకు వెళ్ళి తన కోడలి విషయమంతా వివరించాడు. రాజుగారు ఆమెను తీసుకురమ్మని భటుల్ని పంపాడు. ఆ సంగతి తెలిసి అత్తగారు, మా కోడలు బావిదగ్గర ఎవర్తో నయినా గొడవపడింది? అంది.

కోడలు ఈ వ్యవహారమంతా తెలిసి ఏమీ భయపడకుండా భటుల్తో మీరు వెళ్ళి రాజుగారితో ఒక కోడలిగా నాపై ఆరోపణ అందుకున్నారు? లేదా ఒక కూతురిగా ఆరోపణ అందుకున్నారా? కనుక్కోండి, అంది.

భటులు రాజుగారిదగ్గరకు వచ్చి సమాధానం తీసుకుని తిరిగి ఆమె యింటికి వచ్చి, కోడలిపైన ఆరోపణ వచ్చిందన్నారు. ఆమె పల్లకి ఎక్కి రాజు దగ్గరికి వచ్చింది.

రాజు! మీ ఆయన యింట్లో లేనప్పుడు నలుగురు పరాయి పురుషుల్ని యింటికి ఎందుకు పిలిపించావు? అని అడిగాడు.

కోడలు, రాజుగారూ! దాహంతో వున్నవాళ్ళకు ఒకగ్లాసు నీళ్ళుయిచ్చి దాహం తీర్చడం ఒక గృహిణి కర్తవ్యం. నేను బావి దగ్గరకు వెళ్లినపుడు బట్టలు సరిగా వేసుకోలేదు. చేతులూ శుభ్రంగా లేవు. అందుకని ఆ ప్రయాణికుల్ని యింటికి రమ్మన్నాను. పైగా నేను వేసిన ప్రశ్నలకు వాళ్ళు సమాధానాలు యివ్వ లేకపోయారు. అంది.

రాజు, ఏమిటా ప్రశ్నలు? అన్నాడు.

ఆమె ఆ ప్రశ్నల్ని చెప్పింది. రాజు సభలో వాళ్ళు, రాజుకూడా ఆ ప్రశ్నలకు

సమాధానం చెప్పలేకపోయారు. రాజు దయచేసి నువ్వే ఆ ప్రశ్నలకు సమాధానాలివ్వు అన్నాడు.

ఆమె ఆరంభించింది.

నా వుద్దేశంలో నా మొదటి ప్రశ్నకు సమాధానం ఏమిటంటే నిజమైన బాటసారులు యిద్దరే. ఒకరు సూర్యుడు, రెండోవాడు చంద్రుడు. రెండో ప్రశ్నకు సమాధానం నిజమైన పేదవాళ్ళు ఒకటి ఆవు, రెండోది కొడలు. మూడో ప్రశ్నకు సమాధానం నీళ్లు, తిండి. అవి అందరి దగ్గరకు వెళ్ళినట్లు చదువుని వాళ్ల దగ్గరకూ వెళతాయి అని నేను ప్రశ్నించినపుడు నాలుగో అతను, తెలివి తక్కువవాళ్ళు రెండు రకాలు నువ్వు ఏ రకానికి చెందుతావంటే మౌనంగా వుండి పోయాడు అంది.

అంటే తెలివి తక్కువ వాళ్ళు రెండు రకాలంటావా? అన్నాడు రాజు. అవును రాజుగారు అందామె.

రాజు ఆసక్తిగా, ఎవరు వాళ్ళు, త్వరగా చెప్పు, అన్నాడు.

మీరు క్షమిస్తే సమాధానమిస్తాను అంది.

ఇది రాజసభ నీకు అభయమిస్తున్నా చెప్పు అన్నాడు రాజు. ఆమె, ఈ సందర్భంలో తెలివి తక్కువ వాళ్ళు యిద్దరు. ఒకరు మా మామగారు. సమయా సందర్భం లేకుండా విషయం తెలుసుకోకుండా నాపైన మీకు ఫిర్యాదు చేసిన వ్యక్తి, రెండోవ్యక్తి మీరు. అతని ఆరోపణని ముందూ వెనకా ఆలోచించకుండా అందరిముందుకూ నన్ను తీసుకొచ్చారు. అందుకు మీరు రెండో రకం తెలివితక్కువ మనిషి అంది.

ఆమె తెలివికి, చురుకుదనానికి సహృదయుడయిన ఆ రాజు సంతోషించి ఆమెను అభినందించాడు.

# 5 వజ్రపు దొంగ

ఒకానాక వ్యాపారస్థుడు బాగా సంపన్నుడు. భూమి, యితర ఆస్తులు బాగా సంపాదించాడు. తను పెద్దవాడవుతున్నానన్న స్పృహ అతనికి కలిగింది. అతనికి నలుగురు కొడుకులు. ఆస్తిని వాళ్ళకు పంచాలని నిర్ణయించుకున్నాడు. మొదటి కొడుక్కు డబ్బు వ్యవహారాలన్నీ ఒప్పగించి చూసుకోమన్నాడు. రెండో కొడుక్కి తన సరుకులన్నీ ఒప్పగించి ఆ వ్యాపారం చూసుకోమన్నాడు. మూడో కొడుక్కి బట్టల వ్యాపారం బాధ్యతలనిచ్చాడు. నాలుగో కొడుక్కి భూములన్నీ ఒప్పగించి వ్యవసాయం సక్రమంగా సాగించమన్నాడు.

నలుగురు కొడుకులూ చురుకయిన వాళ్ళు, తెలివైన వాళ్ళు. తండ్రి ఒప్పగించిన పనుల్ని బాధ్యతగా నిర్వర్తించి వాటిని మరింత అభివృద్ధి చేశారు.

తండ్రి యిక తనకు సమయం దగ్గరపడిందని కొడుకులందర్నీ ఒకరోజు దగ్గరికి పిలిచి, నేను పెద్దవాణ్ణియ్యాను. ఎంతో కాలం బతకను నేను వెళ్ళే ముందు మీకొకరహస్యం చెబుతాను. మీరు ఎప్పటిలాగే కలిసివుండండి. మీలో మీకు ఘర్షణలు వద్దు. నేను పడుకునే ఈ మంచం కింద బండను తొలగిస్తే అందులో వజ్రాలు వున్నాయి. వాటిని సమంగా పంచుకోండి. అయితే ఆ పని నా అనంతరం చేయండి అన్నాడు.

కొన్నాళ్ళకు వ్యాపారస్థుడు చనిపోయాడు. నలుగురు కొడుకులు తండ్రి చెప్పినట్లు అతని మంచం కింద బండను తొలిగించి చూశారు. కానీ ఆశ్చర్యంగా అక్కడ మూడు వజ్రాలు మాత్రమే వున్నాయి. నలుగురిలో ఎవరో ఒకరు నాలుగో వజ్రాన్ని తస్కరించారని సందేహం కలిగింది. ఘర్షణ పడితే తండ్రి ఆత్మ శాంతించదు. ఆ దొంగను కనిపెట్టాలి! ఎలా! అన్న ఆలోచనలో పడ్డారు.

ఏమీ తోచక, సమస్య నెట్లా పరిష్కరించాలో పాలుపోక నలుగురూ రాజు దగ్గరకు వెళ్ళారు. ఆ రాజు న్యాయం తెలిసినవాడు. ఆయన తప్పక పరిష్కరిస్తాడని నమ్మకంతో వెళ్ళారు.

వాళ్ళు రాజుతో, రాజా! మాకు ఆ వజ్రం ఎట్లాగయినా అందాలి ఐతే ఆ దొంగ ఎవరో తెలీకూడదు. దయచేసి దానికి మార్గమేదో మీరు చెప్పండి. దానివల్ల భవిష్యత్తులో మా అన్నదమ్ముల సంబంధం సజావుగా సాగేలా చూడాలి, అన్నారు.

రాజు వాళ్ళు చెప్పిందంతా సావధానంగా విని ' మంచిది మిత్రులారా! ఈ రోజు మీరు మా అతిథిగృహంలో విడిది చేసి విశ్రాంతి పొందండి రేపు ఉదయాన్నే నేను మార్గం చెబుతాను అన్నాడు.

సోదరులు నలుగురూ అతిథిగృహానికి చేరారు. వాళ్ళు అతిథిగృహం చేరిన వెంటనే వాళ్ళకు మంచి వంటకాలు సిద్ధంచేసి వడ్డించారు. నలుగురూ భోంచేస్తూ వుండగా ఒక సోదరుడు, 'ఈ భోజనం చాలా రుచిగా వున్నా ఈ రొట్టెల పిండి రక్తంతో మలినమైంది' అన్నాడు.

రెండో సోదరుడు, ఈ నేయి తాజా నెయ్యి కాదు, రుచిలేదు! అన్నాడు మూడోసోదరుడు, మనకు వడ్డించిన ఈ పాలలో మనిషిపాలు కలిశాయన్నాడు. మనకు వడ్డించిన ఈ ఆకుకూర ఆవుపేడతో కలుషితమైంది అన్నాడు.

అక్కడవున్న పనివాళ్ళలో ఒకడు ఆ మాటలన్నీ విని వెళ్ళి రాజుతో చెప్పాడు. రాజు ఆ మాటలు విని ఆగ్రహించాడు. నలుగురు సోదరుల్ని తన ముందుకు రమ్మని ఆజ్ఞాపించాడు. వంట పనివాళ్ళందరికీ పెద్దగా వున్న భోజనశాల అధికారిని కూడా పిలిపించాడు.

రాజు సోదరులతో, మీరు వంట గురించి చెప్పిన విషయాలు వాస్తవాలా? అన్నాడు. సోదరుల్లో పెద్దవాడు, ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకోవాలంటే మీరు పరీక్షించండి అన్నాడు.

మొదట రాజు ఎవరయితే పిండిని సరఫరా చేశాడో అతన్ని పిలిపించాడు. అతను, రాజుగారూ! నేను ఫలానా రైతు నించీ పిండిని కొన్నాన న్నాడు. ఆ రైతును రప్పించారు.

ఆ రైతు చేతులు జోడించి, మహారాజా! నన్ను మన్నించాలి. నేను గోధుములు ఆరబోసి వుంటే ఒక ఎలుగ్గొడ్డు వచ్చింది. దాన్ని చంపినపుడు కొన్ని రక్తపు చుక్కలు గోధుమల మీద పడ్డాయి. ఆ విషయం నేను గమనించలేదు, అన్నాడు. దాంతో మొదటి సోదరుడు చెప్పినమాటలు నిజమయ్యాయి.

తరువాత నెయ్యి సరఫరా చేసిన అతన్ని పిలిపించారు. అతను ఒక పనిమనిషి ద్వారా తెప్పించానని అన్నాడు. ఆ పనిమనిషిని పిలిపిస్తే ఆమె తాజా నెయ్యి యివ్వలేదని ఒప్పుకుంది. రాజు ఆశ్చర్యపోయాడు.

రెండో సోదరుడి మాటలు నిజమయ్యాయి.

తరువాత పాలను సరఫరా చేసిన వ్యక్తిని పిలిపించారు. అతను తన భార్య

తను పాలను పితుకుతూ వుంటే పక్కనే వున్న తన భార్య బిడ్డకు పాలిస్తూ వుందని మధ్యలో బిడ్డ తలతిప్పిందని, అప్పుడు రెండు చుక్కలు తల్లిపాలు ఆవుపాలలో పడ్డాయని చెప్పాడు.

రాజు దిగ్భ్రమ చెందాడు. మూడో సోదరుడి మాటలు నిజమయ్యాయి.

చివర్న ఆకుకూరలు సరఫరా చేసిన వ్యక్తిని పిలిపించాడు. అతనూ తన తప్పును ఒప్పుకున్నాడు. దాంతో నలుగురు సున్నితత్వానికి ఆశ్చర్యపోయారు. మీరు చాలా సున్నితమైన వాళ్ళు. ప్రతిభావంతులు, తెలివైనవాళ్ళు మీలో ఎవరు తప్పు చేశారో కనిపెట్టడం నా చేతకాని పని. అందుకని మీరు ధర్మపురం రాజుగారి దగ్గరికి వెళ్ళండి. ఆయన వివేకవంతుడు. ఆయన మీ సమస్యకు పరిష్కారం చూపించగలడని నమ్ముతున్నా అన్నాడు.

నలుగురు సోదరులు ధర్మపురం రాజు దగ్గరికి వెళ్ళి తమ సమస్య వివరించి తమ మధ్య ఘర్షణ రాకుండా ఆ సమస్యను సున్నితంగా పరిష్కరించే మార్గం చెప్పమన్నారు.

అప్పటికే ధర్మపురం రాజు వాళ్ళ గురించి విని వున్నాడు. తెలివిగా ఆ సమస్యను పరిష్కరిస్తే తప్ప లాభం లేదనుకున్నాడు. రాజు ఒక కుండను తీసుకు రమ్మన్నాడు. దాని మూతి మూసి వుంది.

రాజు సోదరుల్ని చూసి, ఇందులో ఏ వస్తువుందో చెప్పండి అన్నాడు. పెద్దవాడు ఆ కుండను చేతుల్లోకి తీసుకుని యిటూ అటూ కదిలించి ఇందులోని వస్తువు గుండ్రంగా వుంది అన్నాడు.

రెండోవాడు కుండను పరిశీలించి యిందులో వస్తువు గుండ్రంగా వుంది. అంత కాదు, అది ఎర్రగా వుంది అన్నాడు. మూడోవాడు,యిది గుండ్రంగా, ఎర్రగా వుండడమే కాదు, దాంట్లో గింజలు కూడా వున్నాయన్నాడు.

నాలుగోవాడు, ఇది దానిమ్మపండు, అన్నాడు.

రాజు కుండ బద్దలు కొట్టాడు. దానిమ్మపండు బయటపడింది. రాజు ఆశ్చర్యపోయి వాళ్ళ ప్రతిభను అభినందించాడు. అతిథి గృహానికి వెళ్ళి విశ్రాంతి పొందమని చెప్పాడు.

నలుగురు సోదరులు అతిథి గృహానికి బయలు దేరారు. మొదటివాడు, ఈ దారిలో ఓ కుంటి ఒంటె వెళ్ళినట్లుంది అన్నాడు. రెండోవాడు, దానికి ఒకటే కన్నుంది అన్నాడు. మూడోవాడు దానికి పన్నువూడిపోయింది అన్నాడు.

'దానిపైన ఓ గర్భవతి కూచుని వుంది' అన్నాడు చిన్నవాడు.

వాళ్ళవెంటవుండి అతిధిగృహానికి వాళ్ళను తీసుకెళుతున్న వ్యక్తి అదంతా విన్నాడు.

కాసేపటికి అతను రాజు దగ్గరికి వెళ్ళి తను విన్న సంగతి చెప్పాడు.

రాజు నలుగురు సోదరుల్ని పిలిపించి, ఆశ్చర్యంగా వుందే. అక్కడ అ దారిలో నడిచిన జంతువుకు సంబంధించి యిన్ని వివరాలు మీరు ఎట్లా చెప్పగలిగారు? అన్నాడు ఆశ్చర్యంగా.

పెద్దవాడు, ప్రభువుగారూ! నేలమీద ఒంటె అడుగులు వున్నాయి. మూడుకాళ్ళ అడుగులు స్పష్టంగావున్నాయి. ఒక అడుగు ముద్రలు అస్పష్టంగా కనిపించాయి అందువల్ల అది కుంటిదని భావించాను, అన్నాడు.

రెండోవాడు, ఒంటె ఒకపక్కన వున్న గడ్డినే మేస్తూ వెళ్ళింది. అందుకని అది ఒక కన్ను లేదని భావించాను, అన్నాడు.

మూడోవాడు, అది గడ్డిమేసిన దగ్గర మధ్యలో గడ్డిఎత్తుగా కనిపించింది. అందుకని దానికి ఒక పన్ను లేదనుకున్నాను అన్నాడు.

చిన్నవాడు, ఒంటెమధ్యలో విశ్రాంతి తీసుకున్నప్పుడు పక్కన బరువుగా ఒక చేతిముద్ర పడింది. దాన్ని బట్టి గర్భవతి అని భావించాను, అన్నాడు.

రాజు, మీ ప్రతిభను చూస్తే నేను మీ సమస్యకు పరిష్కారం చూపగలిగిన సామర్థ్యం లేనివాణ్ణని తెలుస్తోంది. మా అమ్మాయి ధారా నగరిలో నివసిస్తుంది. ఆమె తప్పక మీకు పరిష్కారం చూపుతుందని నమ్ముతున్నా అక్కడకు వెళ్ళండి అన్నాడు.

నలుగురు సోదరులు ధారానగరం దారి పట్టారు. ధారానగరిలో రాజు కూతురు తెరవెనకనించీ తీర్మానాలు చేస్తుంది. భవనంలో బాల్కనీలో కూచుం టుంది. భవనం ముందు పెద్దగేటు వుంటుంది. దాని దగ్గర పెద్ద డ్రమ్ము వుంటుంది. ఏదయినా సమస్య వున్నవాళ్ళు వచ్చి ఆ డ్రమ్మును మోగిస్తారు.

అట్లాగే సోదరులు నలుగురూ వచ్చి డ్రమ్ము మోగించారు. రాజు కూతురు వచ్చి తెరవెనక కూచుంది. నలుగురు సోదరులు వచ్చి తమ సమస్య వివరించి పరిష్కారం కోరారు. ఆమె అతిధి గృహంలో విడిది చేయండి. పక్షం రోజులపాటు వుండండి. నాకు చేతనయినంతలో ప్రయత్నిస్తాను అంది.

ఆమె వాళ్ళకు ఒక నిబంధన విధించింది. అదేంటంటే వాళ్ళను మీరు వేరుగా ఒకర్నొకరు కలవకుండా వుండమంది. దానివల్ల వాళ్ళను పరీక్షించే అవకాశం వుండవచ్చని భావించింది.

మరుసటిరోజు పెద్దసోదరుణ్ణి పిలిచి ఈ కథ చెప్పింది.

ఒక నగరంలో ఒక రాజు వుండేవాడు. అతనికి ఒక కొడుకు ఆ రాజు దగ్గరవున్న

మంత్రికి ఒక కొడుకు. ఈ కుర్రాళ్ళిద్దరూ మంచి మిత్రులు వాళ్ళకు పెళ్ళి జరిగింది. వాళ్ళ మధ్య ఒక అంగీకారం కుదిరింది. అదేమిటంటే మొదటి రాత్రి తమ భార్యల్ని మిత్రుని దగ్గరికి పంపాలని. ఎవరిపెళ్ళి మొదట జరిగితే వాళ్ళు ఆ పనిచేయాలని ప్రమాణం చేసుకున్నారు. అప్పటి నించీ వారి స్నేహం మరింత బలపడింది.

మొదట రాజకుమారుడికి పెళ్ళయింది. అతని భార్యయింటికి వచ్చింది. తను తన మిత్రుడికిచ్చిన హామీ రాజకుమారుడికి గుర్తొచ్చింది. తమ మిత్రుల మధ్యవున్న ఒప్పందాన్నీ భార్యతో చెప్పాడు. ఆ కొత్తగా పెళ్ళయిన రాజకుమారి భర్త కోరిక తీర్చాలనుకుంది. సరేనంది. ఆమె రాజభవనాన్ని వదిలి మంత్రి కుమారుని కలవడానికి వెళ్ళింది.

ఆమె కొంత దూరం వెళ్లేసరికి ఒక దొంగల గుంపు ఎదురైంది. వాళ్ళు ఆమెను ఆపి ఆమె వేసుకున్న నగల్ని లాగడానికి ప్రయత్నించారు. ఆమె దొంగలతో, మీరు నా తండ్రుల్లాంటివాళ్ళు. నేను చెప్పేది వినండి.నేను రాజకుమారిని రాజకుమారుడి భార్యను. మంత్రి కొడుకును కలవడానికి వెళుతున్నాను. ఇది నా మొదటి రాత్రి. అక్కడికి వెళ్ళి మొదట నా భర్త కోరికను తీర్చనివ్వండి. నేను అక్కడి నుండి తిరిగి వచ్చాకా నా నగలన్నీ మీకు యిచ్చేస్తాను, అంది.

దొంగలు వాళ్ళలో చర్చించుకున్నారు. ఒక దొంగ ఈమె రాజకుమారి మనల్ని మోసం చేసే వీలుంది. అన్నాడు. యింకొకడు, ఆమెను వెళ్ళనిస్తే నష్టం, అన్నాడు. దొంగల నాయకుడు. సరే! నువ్వు వెళ్ళు కానీ నీ హామీ నిలుపుకో అన్నాడు.

పెళ్ళికూతురు ముందుకు సాగింది. అది అర్థరాత్రి, మంత్రికొడుకు ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు. అడుగుశబ్ధం వినిపిస్తూనే తలుపు తెరిచి ఆమెను ఆహ్వానించాడు. 'ఇది నీ సోదరుడు నీకిచ్చే ఒక చిన్ని బహుమానం' దీన్ని కాద నకు చెల్లీ! అన్నాడు ఆమెకు మంచిభోజనం పెట్టి ఆమె పాదాలకు నమస్కరించాడు. ఆమె వెనుదిరిగింది.

ఆమె దారిలో దొంగల్ని కలుసుకుంది. ఇదిగో! నేను తిరిగి వచ్చాను, నా ఆభరణాల్ని స్వీకరించండి అంది. ఒక్కొక్క ఆభరణాన్ని తీయడం మొదలు పెట్టింది. దొంగలనాయకుడి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఎట్లాంటి ప్రయత్నమూ లేకుండా లక్షల విలువచేసే ఆభరణాలు తమకు దొరికినందుకు దొంగలందరూ ఆశ్చర్యపోయారు. దొంగల నాయకుడు ఆభరణాల్ని తీసుకోడానికి తిరస్కరించాడు. అతను అమ్మాయి! నీలాంటి నిజాయితీపరురాలి నుండి మేము ఎలా తీసుకుంటాం అని బదులుగా ఆమెను ఒక వజ్రాలహారమిచ్చి పంపించాడు.

"పెళ్ళికూతురు యింటికి తిరిగి వచ్చి తన భర్తతో జరిగినదంతా పూసగుచ్చి వివరించింది"

ఈ కథ చెప్పి రాజకుమారి పెద్దవాణ్ణి “ఈ కథ విన్నావు కదా! రాజకుమా రుడు, మంత్రి కుమారుడు, పెళ్ళికూతురు, దొంగలు వీళ్ళ గురించి నీ అభిప్రాయం చెప్పు అంది. పెద్దవాడు, నాకు తెలిసినంతవరకు వాళ్ళు నిజాయితీపరులు. రాజకుమారుడు మాటకు కట్టుబడిన వ్యక్తి గనక తన భార్యను మొదటి రాత్రే మిత్రుని ఇంటికి పంపాడు. అట్లాంటి వ్యక్తులు అరుదుగా వుంటారు. ఆ పెళ్ళికూతురు కూడా గొప్ప వ్యక్తి. ఆమె భర్తమాటను జవదాటని ఉత్తమురాలు. పైగా మొదటిరాత్రి భర్త ఆజ్ఞను పాటించింది. దొంగలకిచ్చిన మాటను నిలుపుకుంది. ఆ యిద్దరిలాగా మంత్రి కొడుకు కూడా విశ్వాసపాత్రుడు. ఆమెను తన సోదరిలా భావించాడు. దొంగలు కూడా మంచివాళ్ళే. లక్షలవిలువ చేసే నగల్ని వాళ్ళు తీసుకోలేదు. వాళ్ళు నిజాయితీపరులు ఆమె మాటకు కట్టుబడి వచ్చినందుకు ఆమెను అభినందించారు అన్నాడు.

రాజకుమారి రెండో వాణ్ణి పిలిచి అదే కథ చెప్పి అభిప్రాయమడిగింది. అతనూ పెద్దవాడు చెప్పిన సమాధానమే చెప్పాడు.

మూడోవాడు కూడా అట్లాంటి సమాధానమే యిచ్చాడు.

నాలుగోవాణ్ణి పిలిచి కథ చెప్పి అతని అభిప్రాయమడిగింది. నాలుగవ వాడు తక్కిన ముగ్గురి కన్నా భిన్నమయిన అభిప్రాయం చెప్పాడు.

మీరు నన్ను నిజాయితీగా సమాధానం చెప్పమని అడిగితే నేను రాజకుమారుణ్ణి తెలివితక్కువవాడంటాను. అర్థరాత్రి పూట అప్పుడే పెళ్ళయిన స్త్రీని ఒంటరిగా తన స్నేహితుడి యింటికి పంపడం పూర్తిగా బుద్ధిహీనమయిన పని. అట్లాంటి హామీ యివ్వడమన్నది పనికిమాలినపని. ఆ పెళ్ళికూతురు తత్వం కూడా మంచిది కాదు. అందుకనే అర్థరాత్రి ఆమె పరపురుషుణి యింటికి వెళ్ళడానికి ఏమాత్రం సందేహించలేదు. ఇక మంత్రి కొడుకు అతనూ బుద్ధిహీనుడే తన దగ్గరకు వయసులో వున్న ఆడపిల్ల వస్తే ఆమెను కనీసం తాకకుండా తిరిగి పంపాడు. దొంగలు అందర్నీ మించిన తెలివిమాలినవాళ్ళు. వచ్చిన అవకాశాన్ని చేజేతులా చేజార్చుకున్నారు అన్నారు.

రాజకుమారి అతని అతిచురుకయిన తత్వంలో కొంత మోసకారి తనాన్ని పసికట్టింది.

ఆ వజ్రం ఎక్కడ దాచావో చెప్పు అంది. మొదట తప్పించుకోవడానికి ప్రయత్నించాడు కానీ చివరకు ఆ వజ్రాన్ని తిరిగియిచ్చాడు. అప్పటికే ఆమె మూడు వజ్రాల్ని తన దగ్గర పెట్టుకుంది. వాటికి నాలుగో వజ్రాన్ని కలిపి నలుగుర్నీ పిలిచి ఆ నాలుగు వజ్రాల్ని తలకొకటి పంచింది. నలుగురు సోదరులు ఆనందంగా కలిసి తమ వూరు వెళ్ళారు. జీవితమంతా కలిసివున్నారు. ఆ రహస్యం రహస్యంగానే మిగిలిపోయింది.

# 6 వివేకవంతుడయిన న్యాయనిర్ణేత

ఒక వూళ్ళో యిద్దరు అన్నదమ్ములు వుండేవాళ్ళు. వాళ్ళ తండ్రి చనిపోతూ యిద్దరికీ ఆస్తిని సమంగా పంచాడు. కానీ అన్నదమ్ములిద్దరూ ఎవరికివారు తమకే ఎక్కువ వాటా రావాలని నిత్యం పోట్లాడుకునేవాళ్ళు. వాళ్ళ మధ్య తగవు తేలేది కాదు.

వీళ్ళ సమస్యని చూసి వూళ్ళోవాళ్ళు ఫలానా గ్రామపెద్ద. ఎంతపెద్ద సమస్యనయినా క్షణంలో తీర్చేస్తాడు. ఆయన వద్దకు వెళ్ళారంటే మీ తగవు తీరుస్తాడు అని సలహాయిచ్చారు.

అన్నదమ్ములిద్దరూ ఆవూరికి బయల్దేరారు. ఎంత దూరం వెళ్ళినా అందరూ ఆ వూరు ఇక్కడే కొంతదూరమే అంటారు కానీ కాళ్ళు నొప్పులు పెడుతున్నాయి. యింకా ఎంత దూరం వెళ్ళాలో ఏమో అనుకున్నారు. అంతలో పచ్చని పొలాలు చెట్లు, వాటి మధ్య యిళ్ళు కనిపించాయి. మొత్తానికి గ్రామం చేరారు. ఆ పెద్దమనిషిది పెద్దయిల్లు. దాని దగ్గరకు వెళుతూ ఎదురొచ్చిన వ్యక్తిని ఫలానా పెద్దమనిషి యింట్లో వున్నాడా! అని అడిగారు.

అతను, నేను అతని దగ్గరే పని చేస్తాను. కానీ ఆయన చెవిటివాడు, అన్నారు. సోదరులు ఆశ్చర్యపోయాడు. పెద్దమనిషికి చెవులు వినపడకుంటే ఆయన ఏమి వింటాడు? ఏమి తీర్పు చెబుతాడు? అని నీరసపడ్డారు.

గేటుదాటి లోపలికి వెళుతోంటే ఆ పెద్దమనిషి కూతురు ఎదురొచ్చింది. 'పెద్దాయన వున్నాడా? అంటే ఆ అమ్మాయి, నాన్న లోపల వున్నారు. కానీ ఆయనకు కళ్ళు కనిపించవు, అంది.

ఆ మాటల్తో సోదరులు మరింత నీరసించారు. చెవులు వినపడక, కళ్ళు కనిపించక ఈయనేమి వూరి పెద్ద అనుకున్నారు. గదిలోకి వెళ్ళబోయే ముందు పెద్దమనిషి భార్య బయటికి వస్తూ వుంటే 'అమ్మా! అయ్యగారున్నారా? అంటే, లేరు,చచ్చిపోయారు.అంది.

ఆ మాటల్తో సోదరులు హతాశులయ్యారు. ఒకరేమో చెవిటివారని, యింకొకరు గుడ్డివారని, భార్యేమో చచ్చిపోయాడని అంటోంది. అంతా అయోమయంగా వుందే అని వెనుదిరిగి పోబోయారు.

అంతలో పెద్దమనిషి గదిలోంచీ బయటకువచ్చి 'రండి! నేనే గ్రామ పెద్దను. నా కోసమే మీరు వచ్చినట్లున్నారు అన్నాడు. అన్నదమ్ములు ఆశ్చర్యపోయారు. పెద్దమనిషి వాళ్ళకు తాగడానికి నీళ్ళు తెప్పించాడు. మీ సమస్య ఏమిటి? అని అడిగాడు.

సోదరులు మొదట ఆయనకు సంబంధించి విన్నమాటల ఆంతర్య మేమిటో తెలుసుకోవాలని కుతూహలపడ్డారు. యిట్లా ముగ్గురు మీ గురించి మూడు రకాలుగా పనివాడు చెవిటివాడని, కూతురు గుడ్డివాడని, భార్య చనిపోయాడని ఎందుకన్నారు? అని సందేహం వ్యక్తపరిచాడు.

గ్రామ పెద్ద నవ్వి , ఓహో! ఆ విషయాలగురించి మీకు అయోమయంగా వుందనుకుంటాను. చూడండి. నా దగ్గర పది పదిహేను మంది పనివాళ్ళుంటారు. వాళ్ళకు డబ్బు అవసరమవుతుంది ఎవడో వస్తాడు అడుగుతాడు, నేను పనుల తొందరలో వుండి పట్టించుకోను వాళ్ళకు సమయానికి యివ్వను, అందుకని వాళ్ళు నన్ను చెవిటివాడంటారు.

నా కూతురు పెద్దదయింది. తనకు నచ్చినవాణ్ణి సంబంధంగా తెస్తాననుకుంటుంది. నేనేదో సంబంధం తెస్తే ఆ అబ్బాయి అమ్మాయికి నచ్చదు. అందుకని నన్ను గుడ్డివాడంటుంది.

ఇంతక్రితమే నేను ఏవో సమస్యల్తో ఆలోచనల్తో చిరాకుగా వుంటే నా భార్య వచ్చి నసపెట్టింది. నాకు తిక్కరేగింది. నాలుగు తగిలించాను. అందుకని ఆమె మీకు ఎదురై నేను చచ్చానంది అన్నాడు.

ఆ మాటలు విని సోదరులు నోరు తెరుచుకున్నారు. ఏం మాట్లాడ లేకపోయారు.

గ్రామ పెద్ద సరే! యివి ఎప్పుడూ వుండేవే మీ సమస్య ఏమిటో చెప్పండి. తోచిన సలహాయిస్తానన్నాడు.

గ్రామపెద్ద సమస్యల్తో పోలిస్తే తమవీ ఒక సమస్యలా అని సోదరులు ఆయనకు నమస్కరించి వెనుదిరిగారు.

మళ్ళీ ఆ సోదరులు జీవితంలో ఎప్పుడూ పొట్లాడుకోకుండా హాయిగా కలిసి మెలిసి జీవించారు.

# 7 కుండ కొడుకు

ఒక వృద్ధురాలు వుండేది. కుమ్మరి దగ్గరకు వెళ్ళి నాలుగు చిన్నకుండలు తీసుకొచ్చి గోడకున్న అరల్లో పెట్టింది. తరువాత గోధుమ పిండి కలుపుకుని రొట్టెలు చేసుకుంది.

ఆమె ముసలిదయిపోయింది. పనిచేసే శక్తి లేదు. కూచుని నిట్టూర్చి తనలో తనే ఇది పంటకోతల సమయం. నాకో కొడుకు వుంటే పొలం వెళ్ళి గోధమపంటను కోసేవాడు అనుకుంది.

ఆ మాటలు గదిలో ప్రతిధ్వనించాయి. అరల్లో పెట్టిన కుండలు ఆమాటలు విన్నాయి. అవి కదుల్తూ ఒకదాన్తో ఒకటి మాట్లాడుకున్నాయి. ఆ మాటలు వృద్ధురాలి చెవినపడ్డాయి. ఆ మాటలు ఏమిటంటే అమ్మా! అమ్మా! నేను వెళ్ళి గోధుమపంట కొయ్యాలా! అని.

ఆమె యిటూ అటూ తిరిగి, ఎవరక్కడా? ఎక్కడినించీ మాట్లాడు తున్నారు? అంది.

అంతలో నాలుగుకుండల్లో ఒకటి అరనించీ దిగి దొర్లుకుంటూ వచ్చి 'అమ్మ! అమ్మా! ఆ మాటలన్నది నేను అంది.

వృద్ధురాలి పెదాల పై నవ్వు కదిలింది. 'అల్లరికుండా' నువ్వొక్కదానివే ఒంటరిగా ఎలా చేస్తావు? అంది.

అమ్మా! నీ కెందుకు? నువ్వు చూస్తూ వుండు ఏంచేస్తానో అంది. చిన్నికుండ అంటూ దొర్లుకుంటూ తలుపు దగ్గరకు వెళ్ళింది. అట్లా దొర్లుకుంటూ వెళ్ళి గ్రామ పెద్దయింటికి వెళ్ళి, పటేల్! పటేల్! నేను వెళ్ళి నీ గోధుమ పంట కొయ్యాలా? అంది.

పటేలు నిట్టూర్చి కుండను ఎగాదిగా చూశాడు. ఖాళీ కుండ శబ్దం ఎక్కువ చేస్తుందనుకున్నాడు. హుక్కా పీల్చి పొగవదిలి పో! పో! నువ్వు చిన్న పిల్లవి, యిది నీ పనికాదు, అన్నాడు.

కుండ నేను చేస్తానో లేదో చూడు. తరువాత చెప్పు మొదట యింతకూ నేను ఏమాత్రం కోత కోయాలో చెప్పు అంది.

పటేలు యింకోసారి హుక్కా పీల్చాడు ఐనా అంతగా లెక్కపెట్టనట్లు, అయితే చూద్దాం నాకు యాభయి ఎకరాలపొలం వుంది పంటచేతికి వచ్చింది. వెళ్ళి ఆ యాభయి ఎకరాల పంటకోయి అన్నాడు.

కుండపొలానికి వెళ్ళి యాభయి ఎకరాలు గోధమ పైరు కోసింది. అదంతా చూసి పటేల్ నమ్మలేకపోయాడు. నిజానికి అతను డబ్బు కూడబెట్టాడు. దాంతో పనివాళ్ళను పిలిచి పంటకోయించి వాళ్ళకు డబ్బు యిద్దామనుకున్నాడు. ఆ పనంతా కుండ ఒక్కటే చేయడంతో, సరే! నువ్వు చేసిన పనికి నేను డబ్బుయిస్తాను అన్నాడు.

కుండ, నువ్వు డబ్బు యివ్వదలచుకుంటే ఒక పనిచేయి. దాని బదులు గోధుమలు సిద్ధం చేశాకా నాలో పట్టేన్ని గోధుమల్ని యివ్వు అంది

'అవునా? ఆమాత్రం చాలా? అన్నాడు. అతను కుండ చేసిన పనికి దానిపట్ల సానుభూతితో సాయం చేసే వుద్దేశంతో వున్నాడు. కుండ అడిగిన దానికి అంగీకరించాడు. సరే! ఒకరోజు వచ్చి నీకు కావలసింది నువ్వు  తీసుకెళ్ళు అన్నాడు.

పంట నూర్చి గోధుమలు సిద్దం చేశాకా కుండ వచ్చి 'నాలో పట్టేన్ని గోధుమలివ్వు అంది.

పటేలు నవ్వుతూ దాందేముంది తీసుకో, అని కుండలో గోధుమలు పోశాడు. నిండ లేదు. మళ్ళీపోశాడు. యింకా పోశాడు నిండలేదు. ఎన్నిపోసినా కుండ ఖాళీగానే ఉంది.

కుండ చెప్పిన దానికి ఒప్పుకోకుండా వుండాల్సిందని పటేల్ అనుకున్నాడు. అతని దగ్గరున్న గోధుమలన్నీ దాదాపు  అయిపోయాయి. కుండ బండివాణ్ణి పిలిచి బండెక్కి తనయింటికి వెళ్ళింది.

'అమ్మా! తలుపు తెరువు పంట తెచ్చానంది. ముసల్ది తలుపు తెరిచింది. గోధుమల్తో యిల్లు నిండింది. వృద్ధురాలు ఆనందించింది.

కొన్నాళ్ళు గడిచాయి ఒకరోజు రొట్టెలు చేస్తూ వృద్ధురాలు చేయి కాల్చుకుంది.

కుండ అరనించి కిందికి వచ్చి 'అమ్మా! నువ్వు ముసలిదానివయి పోయావు నేను పెళ్ళి చేసుకుని కోడల్ని తెస్తాను' అంది.

కుండ పెళ్ళి చేసుకోడానికి పెళ్ళి కూతురి కోసం బయటకు వెళ్ళింది. దారిలో ఒక పెళ్ళి వూరేగింపు నీటికోసం ఒక బావి దగ్గర ఆగింది. అక్కడున్న బక్కెటు లేక పోవడంతో కుండను చూసితాడు కట్టి నీళ్ళుతోడారు. పెళ్ళి కొడుకు కుండలో నీళ్ళు తాగబోతే కుండ పెళ్ళి కొడుకు గొంతు పట్టుకుంది. పెళ్ళి కూతుర్ని తనకు యిచ్చేదాకా వదలనంది.

పెళ్ళి కూతుర్ని తీసుకుని యింటికి వచ్చి, అమ్మా! అమ్మా! పెళ్ళి కూతుర్ని తెచ్చాను. నీ కోడల్ని తెచ్చాను అంది.

కొడల్ని చూసి సంతోషించింది వృద్ధురాలికి ఆ విధంగా కుండే కొడుకయింది.

# 8 అక్క తెలివి

ఒక సంపన్నుడికి ఏడుమంది కూతుర్లు, ఒక కొడుకు. కూతుళ్ళందరికీ పెళ్ళయింది. కొడుక్కి పెళ్ళి చేసే సమయం వచ్చింది. పెళ్ళిప్రయత్నాలు మొదలయ్యాయి. పెళ్ళి నిశ్చయమయింది. తమ్ముడు తన అక్కలందర్నీ పిలవడానికి వాళ్ళ యింటికి వెళ్ళాడు.

మొదట అతను పెద్దక్క యింటికి వెళ్ళి తనతో బాటు రమ్మన్నాడు. ఆమె తరువాత వస్తాను, యింట్లో చాలా పనులున్నాయి అవి ముగించుకుని వస్తాను అంది. ఆమె వేడివేడిగా చపాతీలు చేసి తమ్ముడికి ఇచ్చింది. ఆడుకోడానికి వెళ్ళిన తన కొడుకుకోసం ఒకటి అట్టిపెట్టింది. తమ్ముడు చపాతీలు తిని ఇంకో అక్కదగ్గరకు బయల్దేరాడు. దారిలో చపాతీలు తింటానన్నాడు తమ్ముడు.

కొంత సమయానికి ఆడుకోవడానికి వెళ్ళిన పసివాడు వచ్చి తినడానికి ఏమైనా ఇమ్మన్నాడు. దాచిన చపాతీని పసివాడికి యిచ్చింది. అది యివ్వబోతూ చూస్తే అది ఆకుపచ్చరంగులోకి మారింది. ఆమె పాత్రల్ని పరిశీలించింది. పిండి కలిపేటప్పుడు ఆమె ఒకపామును నలిపేసి పిండిలో కలిపేసినట్లు తెలిసింది.

ఆ చపాతీలు తమ్ముడు తింటే చనిపోతాడని పరిగెత్తుకుంటూ తమ్ముడు వెళుతున్న మార్గంలో వెతికింది. అతను మరీ అంత దూరం వెళ్ళలేదు. త్వరగా అతని దగ్గరకు వెళ్ళి తను తీసుకెళ్ళిన రుచికరమైనది యిచ్చి ఆ చపాతీలు తీసుకొచ్చేసింది.

ఆమె దారిలో కుమ్మరి, అతని భార్య సారెపై కుండలు చేయడం చూసింది. పక్కన అది దీపావళి సీజన్ కాకున్నా ఎన్నో ప్రమీదలు చేసి కుప్పలు పోసి వుండడం చూసింది. ఎందుకు యిన్ని ప్రమీదలు? అని కుమ్మరిని అడిగింది. దానికతను, అమ్మా! మీకు తెలుసా? ఒక సంపన్నుడికి ఏడుగురు కూతుళ్ళు, ఒక కొడుకు వున్నారు త్వరలో అతని కొడుకు పెళ్ళి కాబోతోంది. ఐతే పెళ్ళికి ముందే అతను చనిపోబోతున్నాడు. ఎందుకంటే విధి లిఖితాన్ని ఎవరూ తప్పించుకోలేరు. వివాహ వేడుకల్లో అతనికి మరణం సంభవించే ప్రమాదం వుంది. బాధతో అతని తల్లిదండ్రులు కూడా చనిపోవచ్చు. బహుశా గుండెఆగి చనిపోవచ్చు. అందువల్ల దారిలో వెలిగించడానికి ప్రమిదలు చేస్తున్నా.

ఆ విషయం విని ఆమె ఎంతో ఆందోళనకి గురయింది. ఆమె కుండల చేసే అతని

భార్యతో! అతని కొడుకుని రక్షించడానికి ఏదైనా మార్గముంది? అంది.

కుమ్మరి భార్య వుంది. అతని అక్కలు ఒకటి పిచ్చిదానిలా ప్రవర్తించి వివాహ సందర్భంలో తనప్రాణానికి తెగిస్తే అది వీలవుతుంది అంది.

ఆ మాటలు విని ఆమె తన తమ్ముడి ప్రాణాల్ని రక్షించడానికి ఎన్ని యిబ్బందులు ఎదురయినా ఎదుర్కోవాలనుకుంది.

ఆమె తన జుట్టును పిచ్చిదానిలా విరబోసుకుని వివాహవేడుకలు ఆరంభం కాబోతున్న తన పుట్టింటికి వెళ్ళింది. అప్పుడే తమ్ముణ్ణి పెళ్ళికొడుకుని చేయబోతున్నారు. పసుపు ముద్దను తీసుకుని అతనికి పూయబోతున్నారు. పెద్దక్క పిచ్చిదానిలా 'మొదట పసుపు పారాణి నాకు పెట్టండి' అంది, బంధువులందరూ అంగీకరించారు. ఆమెకు తమ్ముడి ముందు పసుపు పారాణి పూశారు.

అక్కడి ఆచారాన్ని బట్టి దగ్గరున్న చిన్న కొండమీదకు పెళ్ళి వూరేగింపు వెళ్ళాలి. పిచ్చిదిగా నటించే అక్క తనూ వస్తానన్నది. ప్రమాదవశాత్తు ఒక పెద్ద బండ వాళ్ళ మీద పడబోవుదల్లా పక్కకు వొరిగింది. ఎవరూ గాయపడలేదు. దానివల్ల పెళ్ళి ఆలస్యమయ్యేలా పెద్దక్క చెయ్యగలిగింది.

తరువాత గణపతి పూజలో తమ్ముడు కూచునే చోట ఆమెవచ్చి కూచ్చుంది. ఆమె కూచునే ముందు కింద వున్న ఏడు తేళ్ళను చూసి వాటిని చంపేసింది. అలా రెండో ప్రమాదం తప్పింది.

తమ్ముడు కూర్చునే చాపకింద విషపు ముల్లును తొలిగించింది. అట్లా మూడో ప్రమాదం తప్పింది.

తరువాత పెళ్ళికొడుకు యింటినించీ ఊరేగింపు మొదలయింది. దారిలో ఒక ద్వారం కూలబోయేసరికి పెద్దక్క హెచ్చరికతో ప్రాణాపాయం తప్పింది.

పెళ్ళి పీటల కింద పామును పసికట్టి పెద్దక్క తమ్ముడికి పెద్దప్రమాదం తప్పించింది. పెళ్ళయింది. మొదటి రాత్రి భార్యాభర్తలు పడకగదిలోకి వెళ్ళ బోతూ వుంటే మీరు వద్దు ఆ పడక పై నేను పడుకుంటానందామె. ఆమె వెళ్ళి అక్కడున్న సింహం బొమ్మ తోకను కత్తిరించి దగ్గర పెట్టుకుని తరవాత వాళ్ళను పంపించింది.

మరుసటిరోజు వుదయానికి ఆమె పిచ్చితనం వదిలి మామూలుగా మారి అందరికీ అసలు విషయం చెప్పింది.

అందరూ ఆమె సాహసానికి, తమ్ముడి పట్ల అభిమానానికి అభినందించారు.

# 9 ధన్వర్ – కాకి

అడవిలోపల ధన్వర్ అన్న అతను తన పిల్లల్తో పాటు నివసించేవాడు, తన వలలు, విల్లంబులు తీసుకుని అడవిలో జంతువుల్ని, పిట్టల్ని కొట్టి, పట్టి కుటుంబాన్ని పోషించేవాడు. అతని రోజువారీ కార్యక్రమమేఇది. ఏదో కొద్దిగా పొలం తయారు చేసి పంటపండించినా అతనికి వేటే జీవనాధారం.

అతని దగ్గర ఒక పెంపుడు కాకి వుంది. అది వుదయాన్నే తిండికోసం ఎగిరిపోయి చీకటి పడ్డాకా తిరిగివచ్చేది. అది తన ప్రయాణంలో భాగంగా బ్రహ్మలోకానికి వెళ్ళి బ్రహ్మను దర్శించుకుని వచ్చేది.

బ్రహ్మ సభ ముందు ఒక వేపచెట్టువుంది. దానిపై వాలి అది సభలో జరిగే చర్చల్ని వినేది. అక్కడి నించీ తిరిగి యింటికి వచ్చి అన్ని విశేషాలు ధన్వర్ తో చెప్పేది. అతను అన్నీ వినేవాడు.

ఒక రోజు కాకి వేపచెట్టుమీద కూచుని సభలో జరిగే తతంగమంతా చూస్తూ వుంది. బ్రహ్మ చెబుతున్నవన్నీ ఒక లేఖకూడా రాసి పెడుతున్నాడు.

బ్రహ్మ! ఈసారి వర్షాలుండవు అన్నాడు. యింకా, బాగా తిండి కొరత వుంటుంది. కేవలం పర్వతాలమీద మాత్రమే వర్షం కురుస్తుంది అన్నాడు.

అప్పటి దాకా కాకి ఎప్పటి నించో వింటున్న విషయాల్లో యిది ముఖ్యమైంది. అది ధన్వర్ దగ్గరికి వెళ్ళి, ఈసారి వర్షాలుండవు అందుకని నువ్వు పర్వతం పైకి వెళ్ళు. అక్కడ వర్షాలు పడతాయి. నువ్వు ఏం విత్తితే అవి విస్తారంగా పండుతాయి అంది.

ధన్వర్ కాకి చెప్పినట్లు ఒక పర్వతం మీదకు వెళ్ళి సాగు చేసి అక్కడ వరి పైరు వేశాడు. చక్కగా వర్షం కురిసింది. ఎక్కడా యితర ప్రాంతాల్లో వర్షం కురవలేదు. బ్రహ్మదేవుడు ధన్వర్ పొలంలోని పంటను చూడడానికి వచ్చాడు. సంతోషించాడు. వెళ్ళాడు.

మరుసటి సంవత్సరం బ్రహ్మ, ఈసారి గొప్ప కరువు రాబోతోంది. మిడతలు, పురుగులు పంటల్ని నాశనం చెయ్యబోతున్నాయి అన్నాడు.

కాకి ఈ విషయం ధన్వర్‌కి చెప్పింది. ధన్వర్ దిగులు పడిపోయాడు, కాకి మిడతలు,

పురుగులు అన్నీ కలిసి లక్ష వుంటాయి. వాటిని నువ్వు ఆహ్వానిస్తే నీ పొలానికి వస్తాయి. అప్పుడు అడవిలోని పక్షుల్ని కూడా పిలువు, అన్నాడు. ధన్వర్ కాకి చెప్పినట్లు చేశాడు. పొలానికి వచ్చిన మిడుతల్ని, పురుగుల్ని పక్షులు తినేశాయి. ధన్వర్ పొలం వెనకటికన్నా పచ్చగా, ఏపుగా పెరిగింది. మళ్ళీ బ్రహ్మ వచ్చి పొలం చూశాడు.

యింకో సంవత్సరం బ్రహ్మ, ఈసారి పెద్ద కరువు రాబోతోంది. అయితే చిత్రమేమిటంటే ఎండు గడ్డిని ఎవరు నాటుతారో వారికి మంచి పంట పండుతుంది. అన్నాడు. కాకి వచ్చి ధన్వర్‌కి చెప్పింది. కాకి చెప్పినట్లే ధన్వర్ చేశాడు. వరిపంట విపరీతంగా పండింది.

మరుసటి ఏడు బ్రహ్మ ఈసారి లక్షెలుకలు పంటల్ని నాశనం చేస్తాయన్నాడు. కాకి ధన్వర్‌తో లక్షపిల్లుల్ని ఆహ్వానించమంది. కాని రెండు లక్షల పిల్లు లొచ్చాయి. రెండు పిల్లులకు ఒక ఎలుకే దొరికింది.

తరువాతి ఏడు సరయిన సమయంలో పంటకోత చెయ్యనివాళ్ళు నష్టపోతాడన్నాడు బ్రహ్మ. తన పెంపుడు కాకి చెప్పినట్లు విని ధన్వర్ మంచిపంటను అందుకున్నాడు.

చురుగ్గా, మెలకువతో, స్పృహతో వున్నవాళ్ళు ఎప్పుడూ నష్టపోరు. వాళ్ళని ఎవరూ మోసగించలేరు. విజయం ఎప్పుడు వాళ్ళని అనుసరిస్తుంది.

# 10 మేఘీ రాణా

మేఘీరాణా లావుగా వున్న చిత్రమైన వ్యక్తి. అతను బాగా నల్లగా వుండేవాడు. పొడవైన మీసాలు వుండేవి. అతని ప్రత్యేకమైన పనుల్తో రాజ్యమంతా ప్రసిద్ధుడు. అతను వుల్లాసంగా వున్నపుడు ఆకాశమంత ఎత్తు పెరిగి ఆకాశంలో సాగుతున్న నల్లని మేఘాల్ని పట్టుకుని నలిపేసేవాడు. దాంతో వర్షాలు కురిసేవి ఆహ్లాదంగా వున్న సందర్భంలో గట్టిగా నవ్వేవాడు. అప్పుడు పర్వతాలు కదిలి ఒకదాన్ని ఒకొటి తాకేవి.

రాణా తలలో ఎప్పుడూ దువ్వెన మెరుస్తూ వుండేది. అది అతనికి యిష్టమయిన అలంకారం. కారణం అది అతనికి దేవుడిచ్చింది.

మహి నదీ తీరాన వింధ్య అడవుల్లో గిల్లి అన్న రాజు నివసించేవాడు. అరణ్యంలోని ప్రజలు ఆయాన్ని ఎంతో గౌరవించేవాళ్ళు మేలుకొన్నా, నిద్రపోయినా అతని ఆజ్ఞకు బద్ధులయి వుండేవాళ్లు. అట్లా ఆ రాజు అడవిపై గొప్ప అధికారం చెలాయించేవాడు.

ఒకరోజు రాణా నవ్వులాటకు రాజు కూతురి జుత్తు కత్తిరించాడు. ఆ అమ్మాయి ఏడ్చుకుంటూ తండ్రి దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్ళి చెప్పింది. రాజు వచ్చేలోగా రాణా పారిపోయాడు.

రాజు ఆగ్రహంతో సైన్యాన్ని పంపి రాణాను సజీవంగా బంధించి తీసుకురమ్మన్నాడు. సైన్యం అరణ్యాన్ని జల్లెడ పట్టింది. నదుల్లో, పొదల్లో, అతని కోసం వెతికారు. గుహల్లో, పర్వతాల్లో అన్వేషించారు. రెండు రాత్రులు, రెండు పగళ్లు  వెతికాక వింధ్య పర్వతం పైన అతన్ని పట్టుకున్నారు. గిల్లి రాజు ముందు హాజరుపరిచారు. రాజు కోపంతో 'యితన్ని మంగల్‌జీ'కి అప్పగించండి. అతను ఇతన్ని తగిన రీతిలో శిక్షిస్తాడు అన్నాడు.

మంగల్‌జీ క్రూరత్వానికి పెట్టింది పేరు. మంగల్‌జీ 'రాణాని చూసి ఈ మీసాలు, వికారమయిన గుబురు జుట్టు, వీడి మొఖాన్ని నాకు చూపకండి వీణ్ణి తీసుకెళ్ళి నా వుప్పు నిలవచేసే గదిలో వేయండి అన్నాడు. ఇంకా ఇతను భవిష్యత్తులో ఇతను అల్లరిచిల్లర పనులు ఎలా చేస్తాడో చూస్తాను అన్నాడు.

మేఘీరాణా తెలివైనవాడు. అతన్ని వుప్పు గదిలో వేసిన మరుక్షణం నీళ్ళుగా

మారిపోయాడు. ఆ నీళ్ళన్నీ మంగల్‌జీ యిల్లంతా వ్యాపించాయి దాంతో మంగల్‌జీ ఆందోళన చెంది రాజు దగ్గరకు పరిగెత్తాడు. రాజు భోంచేసి విశ్రాంతి తీసుకుంటూ వుంటే వెళ్ళి చేతులు జోడించి 'రాజా! రాణా సామాన్య వ్యక్తి కాదు. అతన్ని శిక్షించడం నాబోటి వానికి చేతకాని పనీ అన్నాడు.

ఉప్పు గదినించీ రాణాని తీసుకొచ్చి కుండలో పెట్టి కుండను మంటకింద పెట్టారు. నీళ్ళుగా మారి నీళ్ళు పొంగిపొర్లి మంట ఆరిపోయింది.

రాజు కోపంతో రామలక్ష్మణులను వాళ్ళని పిలిచి అడవిలోకి పట్టు కెళ్లమన్నాడు. వాళ్ళు రాణాని అడవిలోకి తీసుకెళ్ళారు. లక్ష్మణ్ రాణాను బాగా కొట్టాడు.

రాణా బాధతో ఏడిస్తే రాముడికి జాలి కలిగింది. లక్ష్మణ్! యిక కొట్టకు యితన్ని పెద్ద దున్నపోతు కొమ్ముకు కట్టెయ్యి. కొన్నాళ్ళకు మామూలు మనిషవుతాడు అన్నాడు

రాణా ఎక్కడున్నాడో ఏమయ్యాడో ఎవరికీ తెలీదు. దేశమంతా కరువు కాటకాలు వ్యాపించాయి. జనాలు చనిపోవడం ప్రారంభించారు. భూమి నెర్రెలు చీలింది. జనం రాజుతో పరిస్థితి మొరపెట్టుకున్నారు.

రాజు ఆందోళన చెందాడు. మూడురోజులు నిద్రలేకుండా ఆలోచించాడు. యిదంతా రాణాని అవమానించడం వల్ల జరిగింది. యిప్పుడతన్ని ఎక్కడ వెతకాలి.

మొత్తానికి రాజే స్వయంగా అరణ్యంలో రాణాని వెతికాడు. దున్నపోతు కొమ్ములకు కట్టిన రాణాని చూశాడు. కట్లు విప్పి యింటికి రమ్మన్నాడు. రాణా రానన్నాడు. నీ కూతుర్ని యిచ్చి పెళ్ళి చేస్తే వస్తానన్నాడు. రాజు అంగీకరించాడు. రాణాకు రాజు కూతురికి పెళ్ళయింది. రాణా శరీరాన్ని పెంచి నల్లని మేఘాల్ని నలిపాడు. వర్షం కురిసింది. జనం ఆనందంతో నాట్యం చేశారు.

# 11 జల ప్రళయం

ఒకరోజు నదీతీరంలో బట్టలుతుకుతున్న వ్యక్తితో చేప జలప్రళయం రాబోతోందని చెప్పింది. దాంతో అతను ఒక పెట్టెలో తను, తనసోదరి, ఒక కోడిపుంజుతో బాటు దాక్కున్నాడు. ప్రళయం వచ్చింది. పెట్టె నీళ్లపై కొట్టుకుపోయింది. అందువల్ల వాళ్ళు నీళ్ళలో మునిగిపోకుండా బతికారు

దేవదూతలు కోడిపుంజు కూత విని నీళ్ళపై  తేలుతున్న పెట్టెను చూసి తీరానికి చేర్చారు.

దేవుడు చాకలితో, ఎవరు నువ్వు? అని అడిగాడు. పేదవాడయిన అతను కథంతా వివరించాడు. అప్పుడు దేవుడు మొదట తూర్పు దిక్కు తిరగమన్నాడు. తరువాత పడమరకు ఉత్తరానికి తిరిగి తనతో బాటు వున్న స్త్రీ తన సోదరి అని చెప్పాడు. తరువాత దక్షిణ దిక్కుకు తిరగమన్నాడు. అప్పుడు చాకలి ఆ స్త్రీ తన భార్య అన్నాడు. అందువల్ల ఆమెను పెళ్ళాడాడు.

వాళ్లకు ఏడుమంది కొడుకులు, ఏడుమంది కూతుళ్ళు పుట్టారు వాళ్ళు విస్తరించి పెద్ద జనాభాగా తయారయ్యారు. మొదట పుట్టిన కొడుక్కి దేవుడు ఒక గుర్రాన్నియిచ్చాడు. కానీ ఆ గుర్రాన్ని ఎట్లా ఉపయోగించాలో అతనికి తెలీ లేదు. స్వారి చెయ్యడం తెలీదు. అందుకని అతను గుర్రాన్ని వదిలేసి అడవిలోపలికి వెళ్ళిపోయాడు. అతని నించే భిల్లు తెగవచ్చింది.

# 12 రాజల్

ఒకరాజు తన భవనం పైన వుదయాన్నే నిల్చుని బయటికి చూస్తున్నాడు. అప్పుడు వీధిలో చెత్తలూడ్చే ఒక స్త్రీ రాజును చూసి ముఖం పక్కకు తిప్పుకుని, 'రామ రామ' అంటూ తుపుక్కున వుమ్మింది.

ఆమె ప్రవర్తన చూసి రాజు ఆశ్చర్యపోయి వెంటనే సేవకుల్ని పంపి ఆ చెత్తలు వూడ్చే స్త్రీని తన దగ్గరికి తీసుకురమ్మన్నాడు. వాళ్ళు ఆమెను రాజు ముందు హాజరుపరిచారు. ఆ పనిమనిషి రాజును చూసి వణికిపోతూ భయంతో నిల్చుంది.

రాజు నన్ను చూసి ముఖం పక్కకు తిప్పుకుని ఎందుకలా ప్రవర్తించావు? అని అడిగాడు. ఆ పనిమనిషి. రాజా! మీరు శిక్షించనంటే నేను నిజం చెబుతాను, అంది. రాజు నీకు అభయమిస్తున్నా నిజం చెప్పు అన్నాడు. పనిమనిషి రాజా! నేను మీ కిందపని చేసేదాన్ని. మీకు అణిగిమణిగి వుండేదాన్ని. కానీ పెద్దలు ఎవరికయితే పిల్లలు లేరో వుదయాన్నే వాళ్ళ ముఖం చూడకూడదంటారు. అందుకని అలా చేశాను. మీకు పిల్లలు లేరు కదా రాజావారూ! అంది.

రాజు ఆమెను పంపేశాడు. మనసంతా దిగులు నిండింది. పిల్లలు లేనప్పుడు ఈ రాజ్యమెందుకు అని ఎవరికీ చెప్పకుండా అరణ్యంలోకి వెళ్ళిపోయాడు. ఆకు అలములు తింటూ సన్యాస వృత్తినవలంభించాడు. ఒకరోజు ఆయనకు ఒక ఆశ్రమం కనిపించింది. ఆ ఆశ్రమంలో వున్న రుషిని చూసి అభివాదం చేశాడు. ఆ రుషి, ఎవరు నాయనా నువ్వు? అన్నాడు. రాజు తన కథనంతా వివరించాడు.

రుషి జాలిపడి ఒక ఫలాన్ని సృష్టించి యిచ్చి, ఈ ఫలం నీ భార్య కివ్వు. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిస్తుంది. అయితే ఆ అమ్మాయికి ఎనిమిదేళ్ళ వయసు వచ్చే సరికి పెళ్ళి చేయాలి. లేని పక్షంలో ఆమె జీవితాంతం అవివాహితగానే మిగిలిపోతుంది అని హెచ్చరించాడు.

రాజు రుషికి కృతజ్ఞతలు చెప్పి రాజ్యానికి వచ్చాడు. తన రాణికి ఆ ఫలాన్నిచ్చాడు. తొమ్మిది నెలలకు అందమైన ఆడబిడ్డకు రాణి జన్మనిచ్చింది. ఆ బిడ్డకు రాజల్, అని నామకరణం చేశారు. అల్లారు ముద్దుగా పెంచారు.

రాజు రుషికిచ్చిన మాటనే మరిచిపోయాడు. రాజల్‌కు ఎనిమిదేళ్ళు వచ్చాయి.

ఒక రోజు రాజు సభలో మంత్రి సామంతుల్తో కొలువుదీరి వున్నాడు. రాజల్ బంతి ఆట ఆడుకుంటూ వుంటే ఆ బంతి సభలోకి వచ్చింది. రాజల్  పరిగెత్తుకుంటూ సభలోకి వచ్చింది. మంత్రి సామంతులు ఆ ముచ్చటయిన రాజకుమారిని చూసి మురిసిపోయారు.

అప్పటిదాకా రాజకుమారికి ఎనిమిదేళ్ల వయసు వచ్చాకా పెళ్ళి చెయ్యాలని రుషి చెప్పిన సంగతే గుర్తుకు రాలేదు. అప్పుడు గుర్తుకొచ్చి రాజు వెంటనే మంగలిని పిలిచి రాజకుమారికి తగిన వరుణ్ణి వెతకాలి. నా స్థాయికి తగిన రాజకుటుంబం నించీ రాజకుమారుణ్ణి చూడు అని ఆదేశించాడు. మంగలి, మంచిది మహారాజా! అన్నాడు.

మంగలి ప్రయాణమయి వెళుతూ వుంటే ఆ మాటలు విన్న రాజకుమారి తన దగ్గరున్న బట్టలిచ్చి ఈ బట్టలు ఎవరికయితే సరిపోతాయో అతన్నే నేను పెళ్ళాడుతా. అంతేకాక అతను వాళ్ళ తల్లిదండ్రులకు ఒకడే సంతానమయి వుండాలి అంది.

మంగలి ఒకప్రాంతం నించీ యింకోప్రాంతానికి వరుణ్ణి వెతుకుతూ ప్రయాణించాడు. ఆ వస్త్రాలు ఏ యువకుడికయినా సరిపోతే అతనేమో తల్లిదండ్రుల ఏకైక సంతానం కాకుండా పోయేవాడు. పాపం మంగలి తన శాయశక్తులా రాజకుమారికి తగిన వరుణ్ణి అన్వేషించే పనిలో పడ్డాడు.

ఒకరోజు ఆ మంగలికి దారిలో మరోమంగలి కలిశాడు. యిద్దరూ పిచ్చా పాటీ మాట్లాడుకుంటూ ఒకరి సమస్యలు మరొకరితో చెప్పుకున్నారు. రెండో అతను, మా రాజుకూ ఒకడే కొడుకు ఆ కుర్రాడు కూడా ఈ బట్టలిచ్చి యివి సరిపోయిన అమ్మాయినే పెళ్ళాడుతానన్నాడు అని చెప్పాడు. వాళ్ళు బట్టలు సరిచూశారు. ఒక్కలాగే వున్నాయి. ఆ రాజుకూ ఒకడే కొడుకు అన్నీ సరిపోయాయి. వాళ్లు వెళ్ళి యిద్దరు రాజుల్ని సంప్రదించారు. వివాహం నిశ్చయమయింపబడింది. ముహూర్తాలు పెట్టుకున్నారు.

కానీ రాజల్ అత్త తన తమ్ముడి కూతురికి ఆ రాజకుమారుణ్ణి యిచ్చి పెళ్ళిచెయ్యాలని వుద్దేశించింది. కానీ ఆ రాజకుమారుడికి రాజల్‌తో పెళ్ళి నిశ్చయ మయిందని తెలిసి ఎట్లాగయినా ఆ పెళ్ళి మాన్పించాలని పథకం వేసింది. తన తెలివితేటలు ప్రదర్శించింది. రాజల్ దగ్గరికి వెళ్ళి  'రాజల్' నువ్వు ఆ రాజకుమా రుణ్ణి పెళ్ళి చేసుకోవాలని దేన్నిబట్టి నిర్ణయించావు? అంది.

అమాయకురాలయి రాజల్, నువ్వు ఆ రాజకుమారుణ్ణి ఎప్పుడయినా చూశావా? అంది. ఆమె అత్త, అక్కడ చూడడానికేముంది. అతను రోజూ బావిదగ్గరకు వస్తాడు నువ్వు గమనించలేదా? అంది.

'అత్తా! నన్ను తీసుకెళ్ళవూ. అతన్ని చూస్తాను అంది ఆసక్తిగా. అత్తకు యిది మంచి అవకాశం, 'ఐతే ఈరోజే నాతోబాటురా. నేను రాజకుమారుణ్ణి చూపిస్తాను అంది.

అత్తతో బాటు రాజల్ బావి దగ్గరకు వెళ్ళింది. అక్కడ ఎవరూ లేరు. రాజల్ అత్తా యిక్కడ ఎవరూ లేరే. నువ్వు రాజకుమారుణ్ణి చూపిస్తానన్నావే అంది.

అత్త,అదిగో! చూడు,అతనే రాజకుమారుడు అని బావిలోఒకతాబేలును చూపించింది.

ఎట్లాంటి జంతువిది. నీళ్ళలో తిరిగే జంతువా నా భర్త తరువాత కుండలు చేసేవాడి యింటికి వెళ్ళి కుండలు చేసే సోదరుడా! నా పెళ్ళికి అందమైన కుండలు చెయ్యకు అంది. తరువాత మంగళవాద్యాలు మోగించేవాళ్ళ దగ్గరికి వెళ్ళి సంగీత కారులారా! నాపెళ్ళికి మేళతాళాలు మోగించకండి! అంది. తరువాత తన అత్తతో, నువ్వు నామంచి అత్తవి. నా పెళ్ళికి పాటపాడకు అంది. ఆమె అత్త తెలివిగా రాజకుమారుడికి అతని గురించి రాజల్ అందరితో తక్కువగా మాట్లాడుతోందని చెప్పి పంపింది.

రాజకుమారుడు విన్న మాటల కన్నా కళ్ళతో చూస్తే గానీ నిజానిజాలు తెలీవని నిర్ణయించుకున్నాడు. కొంతమంది సన్నిహితుల్తో రాజల్ నగరం చేరుకున్నాడు. వాళ్ళందరూ ఒకే రంగులో వస్త్రాలు వేసుకుని గుర్రాలకు కూడా అదే రంగువస్త్రాలు కప్పారు. చంపా అన్న పురుగుల వుద్యానవనానికి వచ్చారు.

వాళ్ళ శరీరాలకు గంధం పూసుకున్నారు. ఆ పరిమిళం అంతఃపురం దాకా వ్యాపించింది. రాజల్ చెలికత్తెతో గంధపు పళ్ళేనికి మూతలు పెట్టారా? అంది.

చెలికత్తె, అమ్మా! అది మనగంధంకాదు. చంపా ఉద్యానవనం నించీ వస్తున్న వాసన, రాజకుమారుడు పెళ్ళికి తరలవచ్చి ఆ ఉద్యానవనంలో విడిది చేశాడు అంది.

రాజల్ ఆశ్చర్యపోయి ఉద్యానవనానికి వెళ్ళింది. ఒకేరంగువస్త్రాల్లో వున్న వాళ్ళని చూసి మీలో రాజకుమారుడెవరు? అంది.

రాజకుమారుడెవరో తెలుసుకుని అతన్ని గురించి అన్యథా భావించి నందుకు క్షమాపణలు కోరింది. కానీ అతను కోపంగా తనపరివారంతో వెళ్ళిపోయాడు.

రాజల్ తన చీరను చెట్టుకు వేలాడదీసి వురివేసుకుని, నేను చనిపోతే అతనికి నా గురించిన సత్యం తెలుస్తుంది అంది.

అట్లా ఆమె వురేసుకుంది.

రాజకుమారుడు యింకో స్త్రీని పెళ్ళాడాడు. రాజల్ వురేసుకున్నట్లు అతనికి తెలిసింది. అతను చాలా పశ్చాత్తాపపడ్డాడు. చంపా ఉద్యానవనానికి వచ్చాడు.

అక్కడ ఒక్క చెట్టుమీది పక్షి, ముత్యంలాంటి పిల్ల నీకోసం మరణిస్తే బతికివుండడానికి సిగ్గు లేదా! అంది.

బాధతో రాజకుమారుడు కూడా ఆత్మహత్యచేసుకున్నాడు.

# 13 రాణి శపథం

పూర్వం ఒకరాజు వుండేవాడు. ఆయనకు వినోదమంటే యిష్టం. ఓ చలికాలం ఆయన తన రాజ్యంలో ఓ ప్రకటన చేశాడు. ఎవరయి ఒక రాత్రంతా చెరువు నీటిలో మునిగివుంటారో వాళ్ళకు తన రాజ్యంలో సగభాగం యిస్తానని చాటింపు వేయించాడు. అది గడ్డకట్టే చలి. పైగా చల్లని నీళ్ళు అందులోనూ నీళ్ళలో మునిగివుండాలి. ఎవరూ సాహసం చెయ్యలేకపోయారు.

ఒక పేద బ్రాహ్మణుడు దరిద్రం బాధ పడలేక ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాడు. అతను ఈ ప్రకటన విని ఎట్లా చనిపోవాలనుకున్నాను కదా! ప్రయత్నించి చూద్దామని నిర్ణయించుకున్నాడు.

రాత్రంతా జీవితం మీద ఆశ వదులుకుని చల్లటి నీళ్ళలో గడిపాడు. తెల్లవారాకా రాజు దగ్గరికి వెళ్ళాడు. రాజు అతను సజీవంగా తిరిగి రావడం చూసి ఆశ్చర్యపోయాడు. తను వినోదం కోసం ప్రకటన ఇస్తే ఈ పేద బ్రాహ్మణుడు నిజంగానే రాత్రంతా నీళ్ళలో వుండి వచ్చాడు ఏం చేయాలి? తప్పించుకునే మార్గమేమిటి? అని ఆలోచనలో పడ్డాడు. రాజు, ఐతే నువ్వు రాత్రంతా నీళ్ళలో వున్నావు. మరి అక్కడ నీకు ఏమీ కనిపించలేదా! అని అడిగాడు.

పేదబ్రాహ్మణుడు, రాజా! మునిగినప్పుడు అంతా చీకటిగావుంది. కానీ ఎక్కడి నించో సన్నని కాంతి వస్తూ వుంది, అన్నాడు.

రాజు, ఐతే ఆ సన్నని కాంతి ద్వారా నీకు వేడి అందింది. అంటే నువ్వు చల్లని నీళ్ళలో వుండ లేదన్నమాట, అన్నాడు.

బ్రాహ్మణుడు హతాశుడయ్యాడు. నీరసించాడు. కానీ పేదవాడు ఏమీ అనలేదు. అన్యాయం జరిగితే తీర్పు చెప్పే రాజే తనకు అన్యాయం చేస్తే తనని ఎవరు రక్షిస్తారు? అని దిగులు పడ్డాడు. ఎవరయినా యింకో రాజే తనకు న్యాయం చెయ్యాలనుకుని పొరుగు రాజును ఆశ్రయించాడు పొరుగు దేశాన్ని ఒకరాణి ఏలుతోంది. పొరుగు రాణి ఈ రాజుని తన అంతఃపురానికి ఆహ్వానించాడు. ఈ రాజు వెళ్ళాడు మరుసటిరోజు

పొరుగు రాణి తన స్వహస్తాలతో వంట చేసి ఈ రాజుకు వడ్డించింది. పొరుగురాణి కూడా ఈ రాజుకు సపర్యలు చేసింది. కానీ ఆమె నీళ్ళ గ్లాసును టేబుల్‌కు కొద్దిగా దూరంలో వుంచింది. భోంచేసేటప్పుడు ఈ రాజు నీళ్ళడిగాడు.

రాణి, నీళ్ళు మీకు కొద్దిదూరంలోనే వున్నాయి కదా! మీరు వాటిని చూసి దాహం తీర్చుకోండి అంది. రాజు నవ్వి, ఎవరయినా నీళ్ళను చూసి దాహం తీర్చుకోవడం చూశారా? అన్నాడు రాణి, ఆ బ్రాహ్మణుడు దూరంగా ఆలయంలోని దీపం కాంతిని చూసి వెచ్చజేసుకోగా లేంది. నీటిని చూసిదాహం ఎందుకు తీర్చుకోకూడదు అంది.

ఆ మాటల్తో రాజు ఆవేశంగా లేవబోయాడు. కానీ తన హావభావాలు బయటికి ప్రదర్శించలేదు. మౌనంగా వుండిపోయాడు. ఎట్లాగైనా ఈ రాణిని పెళ్ళాడి పగతీర్చుకోవాలనుకున్నాడు. తన రాజ్యం తిరిగి వెళ్ళిపోయాడు.

కొంతకాలానికి ఆ రాణి తండ్రికి సందేశం పంపి తను రాణిని పెళ్ళిచేసుకుంటానని చెప్పాడు. మాటిమాటికీ అడగడంతో రాణి తండ్రి ఆమెనిచ్చి పెళ్ళి చెయ్యడానికి అంగీకరించడు.

వివాహవేడుకలు ఆడంబరంగా సాగాయి.

పెళ్ళి మంటపంలో అగ్నిచుట్టూ ఏడు అడుగులు నడుస్తున్నారు. అప్పుడు రాజుకు తన పగ గుర్తుకొచ్చింది. మూడుసార్లు తిరిగిన అనంతరం రాజు ఆమె చేతిని వదిలేసి తన గుర్రంమెక్కి వెళ్ళిపోయాడు. రాజు బృందమంతా తరలిపోయింది. రాణి మొదట బాధపడినా మళ్ళీ ధైర్యం తెచ్చుకుంది.

రాణి ఒక నాట్యబృందం తయారు చేసి దేశదేశాల్లో తన ప్రదర్శనలిస్తూ పేరు తెచ్చుకుంది. ఆమె నాట్యం అద్భుతంగా వుండేది. వేషభాషలు మార్చుకుంది. ఒకరోజు పొరుగురాజు రాజ్యానికి వచ్చింది. నగరంలో రాజు ముందు ప్రదర్శన యిచ్చింది. రాజు ఆమెను గుర్తుపట్టలేదు. అపూర్వమయిన ఆమె నాట్యానికి ముగ్ధుడయ్యాడు. ఆమె ప్రేమలో పడ్డాడు. ఆ నాట్య బృందాన్ని కొన్నాళ్ళు తన నగరంలోనే బసచేయించాడు. కొన్నాళ్ళ పాటు రాణి, రాజు ఆనందడోలికల్లో తేలియాడారు.

కొన్నాళ్ళ తరువాత నాట్య బృందం అక్కడి నుండి తరలిపోయింది. రాణి కొన్ని నెలలకు పండంటి కొడుక్కి జన్మనిచ్చింది. కొడుకును పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు చెప్పించింది. తన కథనంతా కొడుకి చెప్పి ఎట్లాగయినా తన శపథం నేరవేర్చమంది. తన తల్లి మాటను నెరవేరుస్తానన్నాడు.

కొన్నాళ్ళకు అతను రాజు నగరానికి వచ్చాడు. మొదట రాజు దృష్టిలో పడడానికి కొన్ని అల్లరి చిల్లరిపనులు మొదలు పెట్టాడు. ఒక గజదొంగ అవతారమెత్తాడు. అవినీతిపరుడయిన సేనాని యింట్లో భారీ చోరీ చేశాడు. దాంతో నగరమంతా అల్లకల్లోలమైంది. గజదొంగ నగరంలోనే వున్నాడని అతన్ని ఎలాగయినా బంధించాలని రాజు సంకల్పించాడు. రాత్రిళ్ళు తాను ఒక్కడే నగరంలో అన్వేషిస్తూ బయల్దేరాడు. దొంగతనాలు జరిగిన ప్రాంతంలోకి వచ్చాడు. ఈ సంగతి తెలుసుకున్న అతని కొడుకు రహస్యంగా ప్రణాళిక వేశాడు. ఒక పందు ముసలిరూపంలో రాజుకు ఎదురయ్యాడు. రాజు యిటువేపు దొంగల అలికిడి వుందా! అని అడిగాడు అతను, రాజా! నేనూ మీ సైన్యంలో వాణ్ణి. ఆ గజదొంగను పట్టాలనే మారు వేషంలో వెతుకుతున్నా. మీరు యిలా రాజులా కాకుండా నాలాగా వేషం వేసివెతకండి. అప్పుడు దొరుకుతాడు, అన్నాడు. రాజుకు ఆ ఆలోచనవచ్చి ముసలి వేషం వేసి తన గుర్రం చూస్తూ వుండమని ఒక సందులోనికి వెళ్ళాడు. యిదే అదునుగా భావించిన అతని కొడుకు వెంటనే గుర్రమెక్కి తన వేషం విప్పి అంతఃపురానికి వెళ్ళాడు. రాజు లాగే వుండడంతో ఎవరూ అతన్ని సందేహించలేరు. రాజకుమారుడు సేవకుల్తో, ముసలివేషంలో వున్న గజదొంగ ఈ పరిసరాల్లో వుంటాడు. అతన్ని బంధించి తీసుకురండి అని ఆజ్ఞాపించాడు.

సైనికులు ముసలివేషంలో వున్న రాజును బంధించి తీసుకువచ్చారు. అతను నేను రాజును అన్నా వాళ్ళు నమ్మలేదు.

అప్పుడు రాజకుమారుడు తండ్రితో, నాన్నగారూ! యిది నా తల్లి శపథం వివాహం రోజే అగ్ని గుండం చుట్టూ మూడుఅడుగులు తిరగకముందే మీరు మా అమ్మను వదిలి వెళ్ళిపోయారు. మా అమ్మా నాట్య బృందంలో కలిసి మీ మనసు దోచింది. మీరామెను గుర్తించలేదు. నేను మీ కొడుకుని, నన్ను మన్నించండి అని జరిగిన కథ వివరించాడు.

ధైర్యశాలి, సాహసవంతుడు ఐన కొడుకును రాజు కౌగిలించుకున్నాడు. పశ్చాత్తాపంతో భార్యను ఆహ్వానించి క్షమాపణ కోరాడు.

# 14 డబ్బిచ్చి కొన్న పాట

రాణి అని ఒక అమాయకురాలు వుండేది. ఆమెకు రాజు అని ఒక అమాయకుడయిన భర్తవుండేవాడు. వాళ్ళు అమాయకులేకాదు. తెలివితక్కువ వాళ్ళు కూడా.

కొందరికి అన్నీ అద్భుతాలే. ఆశ్చర్యాలే. మొన్నమొన్నటిదాకా మన గ్రామాల్లో ధాన్యం దంచి వండేవారు. అట్లా రాణి ధాన్యం దంచుతూ ఒక రోజు ఆలోచించింది. రాణికి పాటలు రావు. ధాన్యం దంచుతూ ఇరుగు పొరుగు స్త్రీలు పాటలు పాడుకోవడం చూసింది. ఈర్ష్యపడింది. తనకూ పాటవస్తే ఎంత బావుండు. హాయిగా, వుల్లాసంగా పాడుకుంటూ ధాన్యం దంచుకునేదాన్ని కదా అనుకుంది.

రాణి పక్కింటి ఆవిడదగ్గరికి వెళ్ళి, పాటలు ఎక్కడ దొరుకుతాయి? అని అడిగింది. పక్కింటావిడ ఆశ్చర్యపోయి ఏమన్నావు? అంది.

రాణి, పాటలు ఎక్కడ దొరుకుతాయి? అంది. రాణి అజ్ఞానానికి పక్కింటావిడ మనసులో నవ్వుకుని, సంతలో దొరుకుతాయి, అంది.

రాణి యింటికి వెళ్ళి భర్తతో, మీరు వెంటనే సంతకు వెళ్ళి పాటను కొనుక్కురండి అంది. భర్తకు అర్థం కాలేదు ఆమె మళ్ళీ పాటలు సంతలో దొరుకుతాయట వెళ్ళి ఒక పాటను కొనుక్కురండి! అంది.

'సరే తెస్తాను కానీ డబ్బివ్వు' అన్నాడు. రాణి పదిరూపాయలిచ్చింది. రాజు సంతకు వెళ్ళి ఒక షాపులో, పాటలు ఏ షాపులో దొరుకుతాయి అన్నాడు. షాపతను వీడెవడో గొర్రెలా వున్నాడనుకుని, పక్కషాపులో అడుగు అన్నాడు. అట్లా ఏ షాపులో విచారించినా అందరూ లేదన్నారు.

ఒట్టి చేతుల్తో యింటికి వెళితే చీవాట్లు తప్పవనుకుంటూ సాయంత్రం పూట ఇంటి దారి పట్టాడు.

అది చిట్టడవి మార్గం

ఒక చోట, 'గిర్‌గిర్' అన్న శబ్దం వినిపించింది. చూస్తే ఎలుక కాళ్ళతో మట్టి వెనక్కితోస్తూ ముందుకాళ్ళతో, 'గిర్‌గిర్' అని మట్టి తవ్వుతూ కనిపించింది.

అప్రయత్నంగా, గిర్‌గిర్‌గిర్‌గిర్ అంటూ తవ్వింది, అంటూ కూనిరాగం తీశాడు.

అలాపాడుకుంటూ వెళుతూ వుంటే 'సరసర' మంటూ ఒక పాము ముందు దూసుకుపోయింది.

'సరసరమంటూ పాకింది' అని రెండోపాదం పాడాడు. కాస్తదూరం వెళ్ళే సరికి ఒక కుందేలు దిక్కులు చూస్తూ కనిపించింది.

'పిరికిగా పారిపోయింది' అని నాలుగుపాదాల పాటను పాడుకుంటూ యింటికి వెళ్ళి భార్యకు చెప్పాడు.

ఆ రోజు అర్థరాత్రియినా రాణి మేలుకుని ఆ నాలుగు పాదాల పాటను పాడుతూ ధాన్యం దంచుతూనే వుంది.

అప్పుడే వాళ్ళయింటికి దొంగలు వచ్చారు. మొదటగోడకు కన్నం వేశారు. రాణి, గిర్‌గిర్ అంటూ తవ్వింది' అన్న పాటలోని మొదటి పాదం పదేపదే పాడింది. దాంతో దొంగలు ఎవరో తమని చూశారనుకున్నారు. మెల్లగా యింట్లోకి జొరబడేటప్పటికి 'సరసరమంటూపాకింది, అన్న పాటల్లో రెండో చరణం విని వణికిపోయారు. దిక్కులు చూసేరికి  భయం భయంగా చూసింది. అన్న మాటలు వినిపించాయి. దాంతో పారిపోతూనే, పిరికిగా పారిపోయింది అన్న మాటలు వింటూ కాలికి బుద్ధి చెప్పారు.

ఉదయాన్నే యింటికి కన్నం చూసి ఆందోళనలో రాజు భార్యను పిలిచాడు. యిల్లంతా వెతికారు. ఏమీ పోలేదు నువ్వేం చేస్తున్నావు? అని భార్య నడిగితే ఆమె రాత్రంతా ధాన్యం దంచుతూ పాట పాడుతూనే వున్నాను అంది.

రాజు దేవుడే ఆ పాటను తనకు నేర్పాడని మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

# 15 విశ్వాసం

మానవజాతిలో చరిత్రలో మనిషికి కుక్కకు వున్న సంబంధం. విశ్వాసాన్ని ఆధారం చేసుకున్నది. తరతరాలుగా ప్రపంచ వ్యాప్తంగా కుక్కలకు సంబంధించిన ఆసక్తికరమయిన కథలెన్నో వున్నాయి. యిదీ అట్లాంటికథే.

పూర్వం ఒకప్రాంతం నించీ యింకో ప్రాంతానికి వెళ్ళాలంటే రోడ్లు వుండేవికావు. దొంగల బెడద వుండేది. అందుకని మనుషులు ఎన్నో జాగ్రత్తలు తీసుకునే వాళ్ళు.

ఒక వ్యాపారస్థుడు తన సరుకుల్ని కొని దున్నపోతులపై, గాడిదలపై వేసి ఒక ప్రాంతం నించీ యింకో ప్రాంతానికి వెళ్ళి వ్యాపారం చేసుకునేవాడు. ఒకసారి అతనికి డబ్బు అవసరమయి ఒక మార్వాడీ దగ్గర అప్పు తీసుకున్నాడు. నెలరోజుల్లో తన అప్పు తీరుస్తానన్నాడు. బదులుగా అతని దగ్గర వున్న విశ్వాసపాత్రమయిన కుక్కను ఆ మార్వాడీ దగ్గర వుంచమన్నాడు. నెలరోజుల్లో అప్పు తీర్చి తన కుక్కను తాను విడిపించుకు పోతానన్నాడు. మార్వాడీ సరేనన్నాడు.

వ్యాపారస్థుడు తన సరుకులు తీసుకుని యితరప్రాంతాల్లో వ్యాపార నిమిత్తం వెళ్ళిపోయాడు. కుక్క తన యజమాని ఆదేశానుసారం మార్వాడికి ఒదిగి వుండేది. ఒకరోజు రాత్రి మార్వాడీ యింటికి దొంగలు పడ్డారు. అర్థరాత్రి అందరూ నిద్రపోతున్నపుడు యింటికి కన్నం వేసి లోపలికి వెళ్ళారు. యిదంతా చూసిన కుక్క కిక్కురుమనలేదు. కారణం దొంగలు చాలామంది వున్నారు. ఆ దొంగలు యింట్లోని డబ్బు నగలు అన్నీ దోచుకుని బయల్దేరారు. కుక్క నెమ్మదిగా వాళ్ళని అనుసరించింది. ఒక చెరువు పక్కన చెట్టుకింద గుంత తవ్వి నగలు, డబ్బులు దాచి తరువాత వచ్చి పంచుకుందామని దొంగలు వెళ్ళిపోయారు.

పొద్దున్నే మార్వాడీ లబోదిబోమన్నాడు. యిల్లంతా ఖాళీ ఐనందుకు మొత్తుకున్నాడు. కాసేపటికి కుక్క మార్వాడీ దగ్గరికి వెళ్ళి అతని పంచెను పట్టుకుని తనతో బాటు రమ్మన్నట్లు ముందుకు కదిలించి. మొదట సందేహించినా తరువాత మార్వాడీ దానితో బాటు నడిచాడు. అది చెరువు పక్కన వున్న చెట్టుకిందకు వెళ్ళి కాళ్ళతో అక్కడి మట్టిని తవ్వడం మొదలు

పెట్టింది. మార్వాడీ తనూ తవ్వాడు. అక్కడ యింట్లోపోయిన నగలు, డబ్బు, కనిపించడంతో మార్వాడీ పరమానందం చెందాడు.

ఆ కుక్కను కౌవిలించుకుని తనకు ఇంత సాయం చేసింది అని ఆనందించాడు. ఒక చీటీలో వ్యాపారస్థునికి వుత్తరం రాశాడు. నువ్వు నాకు డబ్బు తిరిగి యివ్వాల్సిన పన్లేదు. దానికి మించింది ఈ కుక్క నాకు యిచ్చింది. అందుకని దీన్ని నీ దగ్గరకు పంపుతున్నా, అని రాసి దాన్ని కుక్క మెడ పట్టీకి కట్టి వెళ్ళమని వదిలిపెట్టాడు.

కుక్క ఆనందంతో వాసనపట్టుకుంటూ తన యజమాని ఐన వ్యాపారస్థుడు వెళ్ళిన దారిలో పరిగెత్తింది. వ్యాపారస్థుడు తన ప్రయాణం ముగించుకుని మార్వాడీకి డబ్బు చెల్లించి తనకుక్కను విడిపించుకోవడానికి వస్తున్నాడు. అంతలో అతని కుక్క ఎదురై తోక కదిలించుకుంటూ వ్యాపారి కాళ్ళు నాకబోయింది.

వ్యాపారికి తన కుక్కను చూస్తూనే ఆగ్రహం కలిగింది. ఒళ్ళు మరచిపోయాడు. తను మార్వాడీ దగ్గర పెడితే అది తప్పించుకుని తిరుగుతూ తను కనిపించేసరికి మళ్ళీ తన దగ్గరికి వచ్చిందనుకున్నాడు. ఒక కట్టె తీసుకుని కొట్టాడు. ఎంత బలంగా దెబ్బ తగిలినా కుక్క విశ్వాసంతో తోక కదిలిస్తూ తన యజమాని దగ్గరికే వచ్చింది. దెబ్బల్ని తప్పించుకుని పారిపోవాలని ఏమాత్రం అనుకోలేదు.

అది నోరు లేని జంతువు కదా! పరిస్థితిని వివరించలేదు. కళ్ళతో పరిస్థితి వివరించలేదు, వివరించినా యజమాని అర్థంచేసుకోలేదు. కోపంతో వ్యాపారి కొట్టిన దెబ్బలకు సొమ్మసిల్లి పడిపోయింది. కళ్ళలో విశ్వాసాన్ని ప్రదర్శిస్తూనే చనిపోయింది.

వ్యాపారి అప్పుడు మెడకు వున్న పట్టీ చూశాడు. దానికి కట్టిన వుత్తరం చదివాడు. నిజం తెలుసుకోకుండా తన కుక్కను చంపుకున్నందుకు గుండెల విసిపోయేలా రోదించాడు. దాని శవాన్ని కావలించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ఆ కుక్కను పెద్ద సమాధి కట్టించాడు. అది యిప్పటికీ చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో వుందని చెబుతారు.

# 16 బద్ధకస్తురాలు – నాలుగు కీలుబొమ్మలు

అతను కష్టజీవి. వుదయం నిద్రలేస్తూనే పొలం వెళ్ళి ఎండనక వాననక శ్రమపడి సాయంత్రానికి యిల్లు చేరేవాడు.

అతని భార్య సోమరిపోతు ఒక్కపని చేసేది కాదు. భర్తపట్ల కనీసం సానుభూతి ప్రకటించేది కాదు. కనీసం వంట కూడా చేసేది కాదు. అతను పొలం పనిచేసి అలిసిపోయి వచ్చిన తరువాత అతనే వంటావార్పు చేసి భార్యకు వడ్డించేవాడు. ఎంతో ఓపికగా భరించేవాడు. పైగా ఆమె నాకు యిక్కడనొప్పి, అక్కడనొప్పి అంటే ఆమెకు సపర్యలు చేసేవాడు.

ఇట్లా కొంతకాలం గడిచింది. అతను భార్య ప్రవర్తనతో బాగా విసిగి పోయాడు. ఏంచెయ్యాలో తోచలేదు. అదే వూళ్ళో వున్న తన చెల్లెలు యింటికి వెళ్ళి విషయం వివరించాడు.

ఆమె యిన్నాళ్ళు ఓపికపట్టావు కదా! ఒకటి రెండురోజులు ఆమె పనీపాటా చెయ్యకుండా ఏం చేస్తోందో ఒక కంట కనిపెట్టు అంది. అతను రహస్యంగా భార్యను గమనించాడు. ఆమె మధ్యాహ్నం రుచికరమయిన వంటలు వండి శుభ్రంగా తిని పడుకోవడం చూసి ఆశ్చర్యపడి విషయం తన చెల్లికి చెప్పాడు.

అతని చెల్లెలు తెలివైంది. ఆలోచించి ఒకషాపులో నాలుగు కీలు బొమ్మల్ని కొని అన్నకిచ్చి, యివి మాట్లాడే కీలుబొమ్మలు నీ భార్యకు కనిపించకుండా గదిలో నాలుగువేపులా నాలుగు దాచిపెట్టు నువ్వు లేనపుడు ఆవిడవంటలు చేస్తే అవి ఆవిడను భయపెడతాయి అన్నది. ఆమె చెప్పినట్లే ఆ నాలుగు బొమ్మల్ని తనయింట్లో దాచిపెట్టాడు.

మరుసటి రోజు అతను పొలానికి వెళ్ళగానే అతని భార్య లడ్డూలు చెయ్యడం ప్రారంభించింది.

మొదటి బొమ్మ, ఆహా! ఎంత తియ్యగావుంటాయి రాణిలడ్డులు చేస్తూంది అంది.

రెండో బొమ్మ, నాకు తెలీదు, యిట్లా ఏదోఒకటి రోజూచేస్తూందేమో అంది.

మూడో బొమ్మ, మనమిట్లా మాట్లాడుకుంటే విని భయపడుతుందేమో అంది.

నాలుగోది, మరి మనమంటే భయపడితే అవి చెయ్యడమెందుకు అంది. ఈ మాటలు వినేసరికి ఆమె నిజంగానే భయపడిపోయింది. వణికి పోయింది, ఏం చెయ్యాలో తోచలేదు. యింట్లో నించీ ఈ మాటలు ఎలా వినిపిస్తున్నాయి! క్షణకాలం అలా కూచుండిపోయింది. మళ్ళీ లడ్డూలు చెయ్యడం ఆరంభించింది.

మళ్ళీ నాలుగు బొమ్మలూ మాట్లాడుకోవడం వినిపించింది. అప్పుడు ఆ బద్ధకస్తురాలు యింట్లో దయ్యాలు వున్నాయిని నిర్ధారించుకుంది. ఎక్కడి వస్తువులక్కడే వదిలేసి పొలంలో వున్న భర్త దగ్గరకు పరిగెత్తింది. చెమటలు కక్కుకుంటూ వణికిపోతున్న భార్యను చూసి భర్త నవ్వుకున్నాడు. విషయం అర్థమయింది. భార్య యింట్లో దయ్యాలున్నాయంది.

భర్త, దయ్యాలు ఏం మాట్లాడాయి? అని అడిగాడు ఆవిడ, రాణి లడ్డూలు చేస్తోంది, అన్నాయి.

ఇంకా, ఏమన్నాయి? 'ఆవిడ భయపడుతుందేమో అని కూడా అన్నాయి' అంది. విషయం వున్నదున్నట్లుగా చెప్పు అన్నాడు. ఆమె జరిగిందంతా చెప్పింది. 'మీరు చెప్పినట్లు చేస్తాను, నన్ను దయ్యాల బారినించీ తప్పించండి, అంది.

ఇంకోసారి నాకు తెలీకుండా యిలా చేస్తే దయ్యాలు నిన్ను వదిలి పెట్టవు, అన్నాడు.

అప్పటినించీ దొంగతనంగా వండుకోవడం మానేసింది. సోమరితనం వదిలి భర్తకు పొలం పనిలో కూడా సాయం చేసేది. వంటచేసేది. భర్త ఆమెలో వచ్చిన పరివర్తనకు ఎంతో సంతోషించి నాలుగు కీలు బొమ్మల్ని దాచేశాడు. తన చెల్లికి తన కాపురం కుదుట పడినందుకు కృతజ్ఞతలు చెప్పాడు.

# 17 హరి – గిరి

హరి, గిరి అని యిద్దరు సోదరులు. శంబల్‌పూర్ రాజుగారి కొలువులో వుండేవారు. నిరాడంబరంగా, నిరహంకారంగా నిజాయితీగా పనిచేసేవాళ్ళు. వాళ్ళు దృఢమైన శరీరాలు గలవాళ్ళు ఎట్లాంటి సవాళ్ళు ఎదురయినా శరీరబలంతోనే ఎదుర్కోగలమనే ధీమా వాళ్ళది. అందరిలాగా వాళ్ళు ఖడ్గాలు ధరించేవాళ్ళు కారు. భుజబలంతోనే దీటుగా సమాధానమిస్తామని చెప్పేవాళ్ళు.

కానీ వీరులన్న తరువాత ఖడ్గం ధరించడం అవసరమని అందరూ అనడం వల్ల యిద్దరూ కర్రతో చేసిన ఖడ్గాల్ని ధరించారు. కర్రతో చేసిన ఖడ్గాల్ని ధరించడమేమిటని అందరూ ఎగతాళి చేశారు.

ఎక్కడికి వెళ్ళినా కర్రఖడ్గాల్ని తీసుకెళ్ళేవాళ్ళు అన్ని చోట్లా వున్నట్లే రాజసభలో కూడా అసూయాపరులున్నారు. ఈ సోదరుల పట్ల ఈర్ష్య పడిన వాళ్లు వున్నారు. ఎట్లాగయినా వాళ్ళకు యిబ్బంది కలిగించాలని ఎదురు చూశారు.

సమీప గ్రామంలో ఒక పులి తిరుగుతోందని, అది మనిషిమాంసం రుచి మరిగిన క్రూరజంతువని అందరూ అనుకోవడం రాజు చెవిన పడింది. ఎప్పటినించో హరి, గిరిల పై అసూయతో వున్న వాళ్ళు ఆ పులిని చంపడానికి వీళ్ళని పంపితే ఎలా వుంటుందని రాజుకు సలహా యిచ్చారు. రాజు వాళ్ళను పిల్చి పులి గురించి చెప్పిదాన్ని చంపి ఆ గ్రామానికి దాని పీడ వదిలించండి అని ఆజ్ఞాపించాడు. సోదరులు, అలాగే మహారాజా! అని అడవికేసి బయల్దేరారు. కానీ ఎట్లాంటి ఆయుధాలు వెంట తీసుకెళ్ళలేదు. కేవలం కర్రఖడ్గాల్ని మాత్రమే వెంట తీసుకెళ్ళారు.

వాళ్ళని పంపేట్లు కుట్ర పన్నిన ఈర్ష్య పడినవారు సంతోషపడిపోయారు. అడవిలోని ఆ గ్రామం వేపు వెళ్ళిన వాళ్ళు మళ్ళీ తిరిగి రారని భావించారు.

సోదరులు ఆ గ్రామ సమీపంలోని అరణ్యాన్ని సమీపించారు. వాళ్ళకు తెలుసు. తమపై పగబట్టి కొందరు ఈ పనికి పూనుకున్నారని తెలుసు. ఐనా దైవం మీద భారం వేసి ధైర్యంగా వున్నారు.

పులిని ఎదుర్కోవడానికి వాళ్ళ మార్గంలో వాళ్ళు పథకం వేశారు. మొదట హరి ఒక చెట్టు దగ్గర ఆనుకుని కదలకుండా నిల్చుంటే పులిని ఆకర్షించ వచ్చు. పులిని ఎరగా వున్న హరిమీదకు ఎగబడి వస్తే హరి హఠాత్తుగా తప్పుకుంటే చెట్టు వెనకన వున్న గిరి ముందుకు వచ్చి యిద్దరూ దాన్ని ఎదుర్కోవడానికి పూనుకోవాలి.

ఆ రకంగా ప్రణాళిక వేశారు. చెట్టుకు ఆనుకుని హరి నిల్చున్నాడు. చెట్టు వెనక గిరి అప్రయత్తంగా వున్నాడు. దూరంగా పులి గాండ్రింపు వినపడింది. అది మనిషి వాసన పసికట్టింది. శరవేగంతో వచ్చి ఒక్కసారిగా చెట్టుకు అనుకున్న హరి మీద లంఘించింది. హరి హఠాత్తుగా పక్కకు తప్పుకున్నాడు. దాంతో అది చెట్టును ఢీ కొట్టింది. అప్పుడు సోదరులు ఒక్కసారిగా దాని ముందు కాళ్ళను చెరొకటి పట్టుకుని బలంగా లాగారు. పులి చెట్టుకు అతుక్కుపోయి కాళ్ళు వదిలించుకోలేకపోయింది.

సోదరులు ఎంతబలంగా లాగారంటే పులి ముందు కాళ్ళని విరిచేశారు. వదిలేశారు. కింద పడిన పులి ముందుకు కదలలేక పోయింది. తమ కత్రఖడ్గాలతో దాని తల మీద మోదారు. అది చచ్చిపోయింది.

హరి, గిరి మళ్ళీ తిరిగి నగరానికి తిరిగి వస్తారని ఎవరూ కలలో కూడా అనుకోలేదు. పులితో రాజస్థానంలో ప్రవేశించేసరికి అందరూ ఆశ్చర్య పోయారు.

రాజు వాళ్ళని గొప్పగా సత్కరించి తన అంగరక్షకులుగా వాళ్ళని నియమించు కున్నాడు.